www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

విజయ దశమి శుభాకాంక్షలు

ANDHRAJYOTHI

శనివారం | 12-10-2024 | పేజీలు : 10+8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 192 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: నవమి ఉ. 10.59 తదుపరి దశమి; నక్షత్రం: శ్రవణం తె. 4.25 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: ఉ. 9.15 -10.47; దుర్ముహూర్తం: ఉ. 6.11-7.44; అమృతఘడియలు: రా. 6.28-8.00; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 5.51 | తాడేపల్లిగూడెం సిటీ

Tadepalligudem | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బ్రహ్మోత్సవ శోభితం.. చినవెంకన్న క్షేత్రం

రేపటి నుంచి శ్రీవారి తిరు కల్యాణోత్సవాలు



ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలు ఈనెల 13 నుంచి 20 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. వైఖానస ఆగమాన్ని అనుసరించి పాంచాహ్నిక దీక్షతో ఏటా రెండు పర్యాయాలు బ్రహ్మోత్సవాలను జరపడం ఇక్కడ సంప్రదాయబద్ధమైంది. 17న రాత్రి శ్రీవారి కల్యాణం, 18న రథోత్సవం జరుగుతుంది. ఉత్సవ రోజుల్లో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు జరగవు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నటు దేవస్థానం ఛైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు, ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. -5లో

రాజకీయ ఆయుధాలు సిద్ధం

దశమి నుంచే మరింత పదును.. సభ్యత్వాలు, లక్ష్యాలతో జనసేన, బీజేపీలు

మెరుగైన పాలనతో కూటమి ముందుకు.. పండుగ పూటా వైసీపీ నిందలు -5లో



జయ..జయహే మహిషాసురమర్దిని ..

శ్రీదేవి శరన్నవరాత్రులు శుక్రవారంతో ముగిశాయి. తొమ్మిదో రోజు మహార్నవమి కావడంతో అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం విజయ దశమి. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మహిషాసుర మర్దిని అలంకరణలో ఉన్న ద్వారకాతిరుమల క్షేత్రదేవత కుంకుళ్లమ్మను పైచిత్రంలో చూడవచ్చు.

బాలికలు అన్నింటా రాణించాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు సిటీ, అక్టోబరు 11 : సమాజంలో ఆడ మగా అన్న తేడా లేకుండా అందరూ సమానమని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ బంగ్లాలో నిర్వహించిన కార్యక్రమంలో బాలికలను, బాలికా సంరక్షణ కోసం పాటుపడుతున్న ఉద్యోగులను అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలకు విశిష్టమైన స్థానం ఉందన్నారు. నేటి మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడపిల్లలకు కల్పిస్తున్న అవకాశాలు అందిపుచ్చుకుని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాల్యవివాహాలను ఎదిరించి మంచిగా చదువుకుంటున్న పలువురు బాలికలను అభినందిస్తూ వారికి సర్టిఫికేట్లను కలెక్టర్ అందజేశారు. ఐసీడీ ఎస్ కె.పద్మావతి, డీసీపీవో సూర్య చక్రవేణి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో చిన్నారులతో కలెక్టర్ వెట్రిసెల్వి, అధికారులు

ట్రిపుల్ ఐటీ మురుగునీటి సమస్య పరిష్కారం

నూజివీడు టౌన్, అక్టోబరు 11: మునిసిపాలిటీకి తలనొప్పిగా మారిన నూజివీడు ట్రిపుల్ ఐటీ మురుగు నీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించనుంది. వర్షాలు పడినప్పుడు గొడుగు వారిగూడెం, గాంధీ నగర్ ప్రాంతాల వాసులు ట్రిపుల్ ఐటీ మురుగునీటితో తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ఈ క్రమంలో ఎస్.టీ.పీ నీరు పైపులైన్ల ద్వారా తరలించేందుకు పను లు ప్రారంభించే నిమి త్తం నూజివీడు ముని సిపాలిటీతో ట్రిపుల్ ఐటీ ఎంవోయూను కుదుర్చుకుంది. ముని సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డితో ట్రిపుల్ ఐటీ అధికారు లు శుక్రవారం సమావేశమయ్యారు.

5433

జిల్లాలో 144 మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తులు

- దరఖాస్తు ఫీజు రూపంలో రూ.108.66 కోట్ల ఆదాయం
- ముగిసిన గడువు.. 14న లాటరీ

ఏలూరు క్రైం, అక్టోబరు 11 : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మద్యం విధానాల్లో భాగంగా ఏలూరు జిల్లాకు 144 మద్యం షాపులు ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 2వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరణ చేపట్టారు. తొలుత 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులు సమర్పించడానికి గడువు తేదీగా ప్రకటించినప్పటికీ ప్రభుత్వం మరో రెండు రోజులు గడువు పెంచింది. దీంతో శుక్రవారం రాత్రి 7 గంటలతో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగిసింది. జిల్లాకు మొత్తం 5,433 దరఖాస్తులు అందాయి. ఈనెల 14వ తేదీన జిల్లా కలెక్టర్ సమక్షంలో షాపులకు లాటరీ తీయనున్నారు. ఏలూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 738 దరఖాస్తులు వచ్చాయి. చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 783, భీమడోలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 1,095, జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 959, పోలవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 597, నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 673, కైకలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 588 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కొక్క దరఖాస్తుకు రెండు లక్షల రూపాయలు చొప్పున దరఖాస్తు దారులు సొమ్ము చెల్లించారు. ఈ సొమ్ములను తిరిగి ఇవ్వబడవు. దీంతో ప్రభుత్వానికి జిల్లా నుంచి 108 కోట్ల 66 లక్షల రూపాయలు దరఖాస్తుల రూపంలోనే ఆదాయం వచ్చింది. పశ్చిమ గోదావరి జిల్లాలో 175 షాపులకు గాను 5,595 దరఖాస్తులు రాగా దరఖాస్తుల ఫీజు రూపంలో సుమారు రూ.112 కోట్లు ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది.


BLUE HORIZON MOVIE FACTORY
విజయదశమి శుభాకాంక్షలతో
18నే విడుదల
A PRAVEEN JETTI Film
కల్లు కాంపౌండ్
-1995-
STORY, SCREENPLAY, DIRECTION PRAVEEN JETTI
PRODUCERS
Smt HARIKA JETTI, BURRA MALLESH GOUD (BOTTU), Smt PITLA VIJAYA LAKSHMI
DOP ARE SANDEEP MUSIC SAI SRINIVAS EDITING PANDU
DANCE KARIA NANDA, MAHESH FIGHTS VIOLENT VELU
SUCHIN CINEMAS LLP


KROSSWIRE KREATIONS
A FILM BY KALYAN CHAKRAVARTHY
దసరా శుభాకాంక్షలు
FROM TEAM REWIND
IN THEATERS OCTOBER 18
రివైండ్
SCREENPLAY, DIALOGUES, PRODUCER & DIRECTOR KALYAN CHAKRAVARTHY
MUSIC ASHIRVAD DOP SHIVARAM CHARAN ACTION DIRECTOR NATRAJ CHOREOGRAPHY RAJ KRISHNA STORY BHARAT CHOUDARY
LYRICS RAVI VARMA AKULA EDITOR THUSHARA PALA SFX ETHIRAJ FINAL MIX RAMA NAIDU STUDIOS DI RAJU REDDY PRO MADHU


DARK HISTORY LEADS TO DEADLY MYSTERY
OCT 18TH RELEASING IN THEATERS
దసరా శుభాకాంక్షలు
వీక్షణం
THE OBSERVER IS OBSERVED
ADITYA MUSIC


SUBISHI ENTERTAINMENTS
ASIAN SURESH ENTERTAINMENT LLP
దసరా శుభాకాంక్షలు
లగ్గం
THE CRAZIEST WEDDING EVER
WRITTEN & DIRECTED BY RAMESH CHEPPALA
PRODUCED BY VENUGOPAL REDDY
WORLDWIDE RELEASE OCTOBER 25 IN THEATERS
MN BAL REDDY
MANISHARMA
CHARAN ARJUN
BONTHALA NAGESWARA REDDY
KRISHNA ARTS
G. KRISHNNA
SRIDHAR
AJAY SIVA SANKAR
VIVAREDDY POSTERS
ADITYA MUSIC


SMT CHINTA VARALAXMI PRESENTS
KA PRODUCTIONS
దసరా శుభాకాంక్షలు
SCAN THE QR CODE TO WATCH TEASER
KIRAN ABBAVARAM
క


SVM SRI VEDAKSHARA MOVIES
విజయ దశమి శుభాకాంక్షలు
RANGAPURAM RAGHAVENDRA
MURALI KRISHNA CHINTALAPATI PRESENTS
COMING SOON
శ్రీ శ్రీ శ్రీ రాజావారు
WRITTEN & DIRECTED BY VEGESNA SATISH PRODUCED BY CHINTHAPALLI RAMARAO (BE)
M. SUBBA REDDY KAILAS MENON DAMU NARRAVULA MADHU SRIMANI RAMANJANEYULU CH V SARMA, RAJEEV KUMAR RAMA REAL SATISH
AVULA YADAGIRI NAGU TADALA NARENDRA VARMA MANTENA VEGESNA PRADEEP RAJU SURYA B. VEERABABU ESHWAR ANDE


దసరా శుభాకాంక్షలు
THE DESTROYER
STORY - SCREENPLAY - DIALOGUES - DIRECTION
RAJ THALLURI
PRODUCERS
DR. LAKSHMANA RAO DIKKALA . DR. PRAVEEN REDDY


GUNA HANDMADE FILMS
SMT. RAGINI GUNA PRESENTS
EARLY 2025
euphoria
A GUNASEKHAR FILM
SCAN FOR GLIMPSE
దసరా శుభాకాంక్షలు
PRODUCED BY NEELIMA GUNA
KAALA BHAIRAVA PRAVEEN K POTHAN


people MEDIA FACTORY
CHITRALAYAM
DONEPUDI CHAKRAPANI PRESENTS
మన కుటుంబం మొత్తం 'విశ్వం'
చిత్రం చూస్తూ కడుపుబ్బా నవ్వుతూ సంతోషంగా
"దసరా" పండగ చేసుకుందాం
ALL INDIA RELEASE BY
SRI TIRUMALA TIRUPATI VENKATESWARA FILMS
MACHO STAR GOPICHAND IN
విశ్వం
A SREENU VAITLA FILM
T G VISHWA PRASAD VENU DONEPUDI
VIVEK KUCHIBHOTLA KONDAL JINNA KRITHI PRASAD K.V. GUHAN
CHAITAN BHARADWAJ GOPI MOHAN BHANU - NANDU PRAVEEN VARMA AMAR REDDY KUDUMULA KIRAN KUMAR MANNE
RAVI VERMA KOLLI SUJITH KUMAR ADITYA CHEMBOLU KONGARAPI RAMBABU VAMSI SHEKAR
TIPS TELUGU



పెదపాడులో చిన్నారుల కోలాట నృత్యం
గ్రామోత్సవంలో సందడి

జిల్లాలో దసరా సందడి

పెదపాడు, అక్టోబరు 11: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సత్యవోలులో జరిగిన దసరా వేడుకల్లో జడ్పీ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు దంపతులు అమ్మవారికి పూజలు చేశారు. మహిషాసుర మర్దిని అవతారంలో దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెదపాడులో ప్రభాకర్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారి ఊరేగింపులో చిత్ర విచిత్ర వేషధారణలు, శక్తి, కాళీ అవతరాలు, చిన్నారుల కోలాట నృత్యాలు, తీన్‌మార్ డప్పు వాయిద్యాల నడుమ గ్రామోత్సవం సాగింది. కార్యక్రమంలో నర్రా సుబ్రహ్మణ్యం (బుజ్జి), బొప్పన బాబ్జి, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి దర్శనార్థం క్యూలైన్లలో వెళుతున్న భవాని భక్తులు

ద్వారకాతిరుమలలో భవాని భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, అక్టోబరు 11: వేంకటేశ్వరస్వామి క్షేత్రం శుక్రవారం భవానీ భక్తులతో కళకళలాడింది. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లే దీక్షను చేపట్టిన భక్తులు తిరుగుప్రయాణంలో ద్వారకాతిరుమల స్వామిని దర్శిస్తున్నారు. విశాఖపట్నం, విజయనగరం, రాజమండ్రి, కాకినాడ తదితర ప్రాంతాల భవానీ భక్తులు ద్వారకాతిరుమల చేరుకున్నారు.

భవాని భక్తులకు అల్పాహారం, పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, అక్టోబరు 11: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడకు కాలినడకన వెళ్లే భవాని భక్తులకు ఎస్పీ కెపిఎస్ కిశోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో అల్పాహారం, పండ్లు, మంచినీరు, మజ్జిగను అందించారు. జాతీయ రహదారిపై ఆశ్రం ఆసుపత్రి సమీపంలోని దెందులూరు చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ఏలూరు మీదుగా వెళుతున్న భవానీ భక్తులకు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ స్వయంగా అల్పాహారాన్ని, మజ్జిగ, పండ్లను అందించారు. జాతీయ రహదారిపై భవానీ భక్తులు రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా వస్త్రాలకు, వాహనాలకు అంటించారు. వాహనాల రాకపోకలను గమనిస్తూ భవాని భక్తులు తమ ప్రయాణాన్ని కొనసాగించాలన్నారు. జాతీయ రహదారిపై రోడ్ సేఫ్టీ మొబైల్ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుని భవాని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: దసరా సందర్భంగా కాలినడకన విజయవాడ అమ్మవారి దర్శనానికి వెళ్ళే భవాని భక్తులకు రామకృష్ణాపురం ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉదయం వీరంకి పండు, ఫ్రెండ్స్ సర్కిల్ యూత్ ఆధ్వర్యంలో ఉదయం వడ్డె, మధ్యాహ్నం భిక్షా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బడేటి చంటి, జనసేన నేత రెడ్డి అప్పలనాయుడు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వై.దుర్గారావు, నాగేశ్వరరావు, రమేశ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

చెడుపై మంచి సాధించిన విజయం దసరా



ఎంపీ పుట్టా మహేశ్ దసరా శుభాకాంక్షలు

ఏలూరు రూరల్, అక్టోబరు 11: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దసరా వేడుకలను ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఎంపి పుట్టా మహేష్ కుమార్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని అమ్మవారిని ప్రార్ధించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ సారథ్యంలో ప్రజలకు సాంత్వన చేకూరిందని ఎంపీ అన్నారు.



ఎస్పీ దసరా శుభాకాంక్షలు

ఏలూరు క్రైం, అక్టోబరు 11: చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకునే విజయదశమి వేడుకను ప్రతి ఒక్కరు ఇంటిల్లపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి, కుటుంబ సభ్యులకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ అందరి జీవితాల్లో విజయాలు సమకూర్చాలని చేపట్టిన ప్రతి కార్యం సఫలీకృతం కావాలని కోరారు.

ఏలూరు మేఘావృతం



విజయ దశమి పూజా సామగ్రి కొనుగోలుతో ఏలూరు మార్కెట్ రద్దీగా ఉన్న సమయంలో మబ్బులు కమ్మేశాయి. హడావుడిగా కొనుగోళ్లు సాగాయి.
- ఫొటోగ్రాఫర్/ఏలూరు



మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చిన రాట్నాలమ్మ, ఏలూరులో కనకదుర్గమ్మ, భీమడోలులో కాళికాంబ, దెందులూరు గాజుల అలంకరణ, ఏలూరులో కనకదుర్గ, ఉంగుటూరులో సిద్ధిధాత్రి అలంకరణ

మహిషార మర్దిని

పెదవేగి, అక్టోబరు 11: శరన్నవరాత్రులను పురస్కరించుకుని రాట్నాలమ్మ శుక్రవారం మహిషారమర్థినిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిషారమర్థిని అలంకరణలో అమ్మవారిని విశేష సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారు సింహాన్ని వాహనంగా చేసుకుని, చేతిలో త్రిశూలం ధరించి, శివుని వరాలతో లోకాలను పీడిస్తున్న మహిషారుని సంహరించి, లోక కల్యాణాన్ని తీసుకొచ్చిన అమ్మవారు ఉగ్రరూపిధారిణిగా భక్తులకు దర్శనమిస్తుంది. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు తొమ్మిది రోజులపాటు మహిషారునితో పోరుసల్పి, మహిషారుని అంతమొందించారని అర్చకుడు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణ శర్మ తెలిపారు. ఉగ్రరూపంలో ఉన్న అమ్మవారిని శాంతింప చేయడానికి భక్తులు వివిధ రకాల పండ్లు, పూలు, పిండివంటలను నైవేద్యంగా పెట్టి పూజలు నిర్వహించారని పురాణాలు చెబుతున్నాయని, అదే రీతిలో ఉగ్రరూపిధారిణియైన శ్రీరాట్నాలమ్మవారికి లలితా సహస్రనామ సహిత దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించామని ఆయన చెప్పారు.

● ఏలూరు టూటౌన్: పడమర వీధిలో పాతగంగానమ్మ ఆలయాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి సందర్శించారు. మహిషాసుర మర్దని అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి కరుణా కటాక్షాలు ప్రజలందరికి ఉండాలన్నారు. ప్రజలందరికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, ఎంఆర్‌డీ బలరామ్, బొద్దాని శ్రీనివాస్, కొట్టు మనోజ్, జీ.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్వలోకాలను శాసించే శక్తి దుర్గమ్మ తల్లికి ఉందని, ఆ తల్లి చల్లని దీవెన ప్రజలందరిపై ఉండాలని నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. పత్తేబాద కనకదుర్గమ్మ ఆలయంలో మేయర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్లు పృధ్వీ శారద, జ్యోతిప్రసాద్, వందనాల దుర్గాభవాని, శ్రీనివాస్, దేవరకొండ శ్రీనివాసరావు, నున్నా కిశోర్ పాల్గొన్నారు.

● ఏలూరు కార్పొరేషన్: నగరంలో అమ్మవారి ఆలయాల వద్ద శరన్నవరాత్రులు శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. అమ్మవారిని మహిషాసుర మర్ధిని, మహాకాళిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దక్షిణపువీధి మహిషాసురమర్దిని, బాల త్రిపురసుందరి, అగ్రహారం రాజ్యలక్ష్మి, కన్యకాపరమేశ్వరి, జ్ఞాన సరస్వతి దేవి, పవరుపేట కాశీ అన్నపూర్ణాదేవి, పత్తేబాద, పవరుపేట, బావిశెట్టివారిపేట, తదితర ప్రాంతాల్లో ఆలయాలు, సత్రంపాడు అంబికాదేవి, సౌభాగ్య లక్ష్మి ఆలయాల వద్ద దేవీ నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం విజయదశమి సందర్భంగా రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిస్తారు.

● దెందులూరు: పోతునూరు శివారు ఉండ్రాజవరం కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గోపన్నపాలెంలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, నాటక, కోలాట ప్రదర్శనలు చేసిన కళాకారులకు కమిటీ సభ్యులు తోట రామకృష్ణ, కొండేటి హనుమంతు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం వందాలాది మందితో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

● నిడమర్రు: అమ్మవారు మహిషాసురమర్ధినిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలో భువనపల్లి, మందలపర్రు, పెదనింద్రకొలను, అడవికొలను, ఛానమల్లి, పత్తేపురం గ్రామాలలో వేంచేసియున్న దుర్గాదేవి ఆలయాలలో దసరా ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

● ఉంగుటూరు: మండలంలోని వివిధ గ్రామాలలో కనకదుర్గమ్మ వేర్వేరు రూపాలలో దర్శనమిచ్చారు. ఉంగుటూరు గ్రామదేవత చల్లాలమ్మ సిద్ధి ధాత్రిగా భక్తులకు దర్శనమిచ్చారు,

● భీమడోలు: శరన్నవరాత్రి ఉత్సవాలు 9వ రోజుకు చేరుకున్నాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ళ తదితర గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గుండుగొలను భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు, లక్ష కుంకుమార్చన పూజలు జరిగాయి. అమ్మవారిని కాళికాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



రూ.1.2 కోట్లు

ధనలక్ష్మి అలంకారం

నిడమర్రు మండలం పెదనింద్రకొలను తూర్పుపేట లో అమ్మవారు ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు. రూ. 1కోటి 20 లక్షల నగదుతో అమ్మవారిని అలంకరించారు. సుమారు 140 కాసుల బంగారం అమ్మవారికి అలంకరించారు.



ఏలూరులో వంటనూనె ప్యాకెట్ అందిస్తున్న ఎమ్మెల్యే చంటి



వంట నూనె విక్రయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

రైతు బజార్‌లో వంట నూనె విక్రయం

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 11: ప్రజల సౌకర్యార్థం రైతుబజారులో వంట నూనె విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశామని, అధిక ధరల నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. పత్తేబాద రైతుబజారులో శుక్రవారం వంట నూనె అమ్మకాలను ఆయన ప్రారంభించారు. రైతుబజారులో పామాయిల్ 850 గ్రాముల ప్యాకెట్‌ను రూ.110, 910 గ్రాముల సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124, ఉల్లి కిలో రూ.30, టమాటా కిలో రూ.46 ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక ధరలకు కొనుగోలు చేసుకుని నష్టపోవద్దని, రైతుబజారులో కొనుగోలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. రైతుబజారులలో అన్ని రకాల కూరగాయలను మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకు విక్రయించేలా చర్యలు తీసుకున్నామని సూచించారు. సీఎస్ డీటీ కె.రమేశ్‌కుమార్, మర్చంట్ చాంబర్ అధ్యక్షులు నేరెళ్ళ రాజేంద్ర, సభ్యులు, కార్పొరేటర్లు, నాయకులు, ఎస్టేట్ ఆఫీసర్స్ ఎం.సుధాకరరావు, ఎల్.లెనిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు: పేదలు ఇబ్బందులు పడకుండా వంట నూనె సబ్సిడీపై అందించేందుకు చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దెందులూరులో వంట నూనె విక్రయ కేంద్రాన్ని చింతమనేని ప్రారంభించారు. యిప్పిలి వెంకటేశ్వరావు, గారపాటి కొండయ్య చౌదరి, సర్పంచ్ ఏసమ్మ, ఎంపీటీసీ శేషారత్నం, మహేశ్ యాదవ్, సంపంగి తిలక్, కొలుసు నాని, దాసే శ్రీను, నేతలు పాల్గొన్నారు

నిలకడగా కూరగాయల ధరలు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 11: ధరల నియంత్రణ చర్యలతో రైతుబజార్లలో కూరగాయల ధరలు నిలకడగా ఉన్నాయి. రైతుబజారులో కిలో టమాటా రూ.46, వంకాయలు రూ.58, బెండ రూ.34, మిర్చి రూ.28, కాకర రూ.36, బీర రూ.54, క్యాబేజి రూ.46, క్యారెట్ రూ.48, దొండ రూ.38, బంగాళదుంప రూ.40, ఉల్లి రూ.55, గోరుచిక్కుడు రూ.38, చిక్కుడు రూ.128, దోస రూ.40, చామదుంప రూ.52, బీట్‌రూట్ రూ.40, కీర దోస రూ.36, అల్లం రూ.120, క్యాప్సికం రూ.70, ఆనప ఒక్కింటికి రూ.25, అరటి ఒక్కటికి 7 రూపాయలు, పాలకూర, చుక్కకూర, మెంతుకూర, తోటకూర కట్ట ఒక్కింటికి రూ.పది, పొట్లకాయ రూ.25 చొప్పున విక్రయిస్తున్నారు.



చేబ్రోలులో అంతర్జాతీయ బాలికా దినోత్సవ ప్రదర్శన



భీమడోలులలో అధికారులు, మహిళల ప్రదర్శన

బాలికలకు ఉన్నత విద్యనందించాలి

ఏలూరు రూరల్, అక్టోబరు 11: ఆడపిల్లలు ఉన్నత విద్యను పొందితేనే హక్కులు, సమానత్వం సాధ్యమని రూరల్ తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. రూరల్ మండలం చాటపర్రులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ నేటి సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. శారీరకంగా, మానసికంగా, దృఢంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు నంబూరి నాగరాజు, కాలారి త్రినాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసవర్మ, వీఆర్వో శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా భీమడోలు మండల పరిషత్ కార్యాలయం నుంచి అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. బాలిక సంరక్షణ, బాలికల హక్కులు, విద్య ప్రోత్సహించాలని, బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఎంపీడీవో పద్మావతి, ఎంఈవో భాస్కర్, సూపర్‌వైజర్లు షహనాబేగమ్, నూర్జహాన్, రెవెన్యూ, అంగన్‌వాడీ సిబ్బంది, బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: మండలంలోని వివిధ గ్రామాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బాలికలకు విద్యావకాశాలు వివరించారు. కార్యక్రమాల్లో బాదంపూడి సర్పంచి కంకట లీలా పద్మ, కార్యదర్శి కాకర్ల గిరిదర్, చేబ్రోలు సర్పంచ్ రాంధే లక్ష్మీ సునీత, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నేతలు

దెందులూరు ఎస్ఐగా శివాజీ

దెందులూరు, అక్టోబరు 11: ఎస్ఐగా ఆర్.శివాజీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎస్ఐ స్వామి బదిలీ కాగా ఆయన స్థానంలో రాజమండ్రి నుంచి శివాజీ బదిలీపై వచ్చారు. బాదంపూడి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బాదంపూడి రమేష్ బాబు, టీడీపీ నాయకులు సంపంగి వేణుగోపాల తిలక్, గోరింక యేసోబు, మోదూరి వెంకటేశ్వరావు, బోల్లె రాము, నెరుసు గంగరాజు, కసుకుర్తి రామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ గుమ్మడి వెంకటచైతన్యకృష్ణ, మందూరి బుజ్జిగోపాల్, పలువురు ప్రజాప్రతినిధులు ఎస్ఐకు పుష్పగుచ్ఛం అందజేశారు.

పెదవేగి ఎస్ఐగా రామకృష్ణ

పెదవేగి: ఎస్ఐగా కె.రామకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడి ఎస్ఐ వి.రాజేంద్ర ప్రసాద్ కృష్ణా జిల్లాకు బదిలీఅయ్యారు.

ఫత్తేపురం విద్యార్థినికి ద్వితీయ బహుమతి

నిడమర్రు, అక్టోబరు 11: ప్రపంచ బలికా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీలలో ఫత్తేపురం ఉన్నత పాఠశాల విద్యార్థిని సిరిశెట్టి అమృత లక్ష్మీసాయి ద్వితీయ బహుమతి గెలుచుకొంది. ఏలూరులో జరిగిన కార్యక్రమంలో జేసీ ధాత్రిరెడ్డి బహుమతి అందజేశారు. అమృత లక్ష్మీసాయి, గైడ్ టీచర్ కొచ్చర్లపాటి సుబ్బరాజును ఎంఈవోలు పుచ్చలశేషు, బాలయ్య హెచ్ఎం పీవీ.సత్యనారాయణ, సర్పంచ్ నీలపాల సాయిప్రియ, ఉపసర్పంచ్ రుద్దర్రాజు వెంకటేశ్వరరాజు ఎస్ఎంసీ ఛైర్మన్ ఎస్.దేవి, గ్రామపెద్దలు అభినందించారు.

ఆలయాలకు స్వయంప్రత్తిపత్తిపై హర్షం

ఏలూరు రూరల్, అక్టోబరు 11: దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఆలయ సంప్రదాయాలు, ఆగమ వైదిక వ్యవహారాల్లో ఆశాఖ అధికారులు, ఈవోలు సైతం జోక్యం చేసుకోవడానికి వీలులేకుండా ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమన్నారు. ప్రతి ఆలయంలో వైదిక కమిటీని నియమించాలని జీవో విడుదల చేయడం శుభపరిణామం అన్నారు.

చర్మకారుల సమస్యలు పరిష్కరించండి

ఏలూరు టూటౌన్, అక్టోబరు 11: చర్మకారుల జీవనస్థితులు అధ్వానంగా తయారయ్యాయని ప్రభుత్వం ఆదుకోవల్సిన అవసరం ఉందని చర్మకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొలిమేర హరికృష్ణ అన్నారు. సంఘ కార్యాలయంలో శుక్రవారం సమావేశం జరిగింది. హరికృష్ణ మాట్లాడుతూ చర్మకారులు, డప్పు కళాకారుల ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలియజెప్పేందుకు భారీ సదస్సు నిర్వహిస్తామన్నారు. సంఘం స్థాపించి 30ఏళ్లు పూర్తయిందన్నారు. ఎస్.నాగేశ్వరరావు, ఎస్.కిషోర్, కె.అబ్రహం, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ ముద్దుబిడ్డ టాటా

ఏలూరు టూటౌన్, అక్టోబరు 11: దేశం గర్వించదగ్గ ముద్దుబిడ్డ పద్మభూషణ్ రతన్‌టాటా అని ఎంఆర్‌పీఎస్ నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు శేఖర్ తెలిపారు. పాతబస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నమ్మిన నాగార్జున, కాశీకృష్ణ, ఎస్.లక్ష్మీకుమారి, నేతర అజయ్‌బాబు, ఎం.తిరుపతిరావు, కందుల సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

W.G.Dist,Present Eluru Dist, ELURU SRO, Somavarappadu Grama Panchayat IN R.S.NO.11/2 ... No.66/2006 ... bounded by:
East : Plot No.28 ...
West : Road 50.0 Feet
North : Plot No.14 50.0 Feet
South : Road 36.0 Feet
N.V.B.L.RAO

బహిరంగ ప్రకటన

W.G.Dist,Present Eluru Dist, Ganapavaram S RO,Nidamarru (M), ... R.S.NO.2... 183.33sq ... bounded by:
East : Plot No.11 ...
West : 33 Road 30 Feet
North : 33 Road 30 Feet
South : Plot ...
N.V.B.L.RAO

సేఫ్ మూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్, ఏలూరు

రిజిష్టర్ నెం.ఎయమ్‌సి/డబ్ల్యూజి/డిసిఓ/2017/2805
కేరాఫ్ సేఫ్ నిలయం, 23ఎ-5-9, ఆర్ఆర్‌పేట పార్క్ వెనుక వైపు వీధి, ఆర్ఆర్‌పేట, ఏలూరు-534002, ఏలూరు జిల్లా, ఎ.పి. ఫోన్ : 98664 09192.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు (నెం.54 ఆఫ్ 2002)

దిగువ వారికి,
శ్రీ ఘంటసాల బాలాజి, తండ్రి : వెంకటాజీ, ఇంటి నెం.సి4-37, రామాలయం వీధి, గుడివాకలంక గ్రామం, ఏలూరు, ఆం.ప్ర.-534004.

మీరు ఈ దిగువ ఉదహరించిన ఆస్తులను తనఖా ఉంచి మా ఏలూరు బ్రాంచి నుండి గృహఋణ సౌకర్యాన్ని పొందియున్నారు. సదరు ఋణఖాతా లో రూ.11,85,295/- (అక్షరాల పదకొండు లక్షల ఎనభై ఐదు వేల రెండు వందల తొంభై ఐదు రూపాయలు మాత్రమే) మరియు వడ్డీతో మరియు సదరు బకాయి మొత్తంపై అంగీకరించిన కాంట్రాక్చువల్ రేటు ప్రకారం వడ్డీ + ఇతర ఖర్చులు మరియు బ్యాంకు ఛార్జీలకు మీరు సేఫ్ మూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్, ఏలూరుకు బకాయి ఉన్నారు.

అస్తి షెడ్యూలు

ఏలూరు ఆర్.ఓ. పరిధిలో గల డాక్యుమెంట్ నెం.3653/2017 ప్రకారం శ్రీ ఘంటసాల బాలాజి, తండ్రి : వెంకటాజి గారికి చెందిన ఆస్తి : పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు ఆర్.ఓ. ఏలూరు మండలం, గుడివాకలంక పంచాయితీ మరియు గ్రామంలో ఆర్.ఎస్.నెం.350 లో 155 చ॥గ॥ల విస్తీర్ణంలో డోర్.నెం.సి4-37/1 కలిగిన ఇల్లు. హద్దులు : తూర్పు : జె గంగరాజు గారి ఇల్లు 30.5 అ॥లు, దక్షిణం : జి రాంబాబు గారి ఇల్లు 46.0 అ॥లు, పడమర : రోడ్ 29.5 అ॥లు, ఉత్తరం : బి రాఘవులు గారి ఇల్లు 47.0 అ॥లు.

పైన పేర్కొనబడిన SARFAESI చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును బ్యాంకు మీకు జారీచేసినది. కాని మీకు పంపినట్టి నోటీసులు మీకు చేరక తిరిగి వెనుకకు వచ్చినది. అందువలన దిగువ సంతకందారుడు సదరు నోటీసులను ఋణగ్రహీత/లు చివరిగా తెలిపిన చిరునామాల ఆవరణల యందు అతికించడమైనది. అందువల్ల ఈ పత్రికా ప్రకటన ఇవ్వబడినది. మా జారీ షరతులు మరియు నిబంధనలు పాటించుటలో మీరు విఫలమైనందున మీ ఖాతా క్రమము తప్పి NHB మార్గదర్శకాల ప్రకారం ది.31.03.2024 నాటి నుండి ఎన్.పి.ఏగా వర్గీకరించబడినది. ఈ నోటీసు ప్రకటన తేది నుండి కాంట్రాక్చువల్ రేటు ప్రకారం 01.04.2024 నుండి వడ్డీ + ఇతర ఖర్చులు మరియు ఛార్జీలతో కలిపి పైన తెలిపిన సదరు మొత్తమును 60 దినములలో తిరిగి చెల్లించవలసినదిగా మిమ్ముల్ని కోరడమైనది. లేనియెడల ఎటువంటి తదుపరి ప్రకటన లేకుండా పైన తెలిపిన సెక్యూరిటీ పైన SARFAESI చట్టంలోని నిబంధనలు అమలు చేసేందుకు చర్యలు చేపట్టుటకు సెక్యూర్డ్ క్రెడిటర్ అగు దిగువ సంతకందారు సంసిద్ధులైతారు. ఇంకా తెలియజేయునది ఏమనగా ఋణగ్రహీతలు/హామీదారులు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించగలరు.

తేది : 11.10.2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : ఏలూరు (సేఫ్ మూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్, ఏలూరు)

సేఫ్ మూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్, ఏలూరు

రిజిష్టర్ నెం.ఎయమ్‌సి/డబ్ల్యూజి/డిసిఓ/2017/2805
కేరాఫ్ సేఫ్ నిలయం, 23ఎ-5-9, ఆర్ఆర్‌పేట పార్క్ వెనుక వైపు వీధి, ఆర్ఆర్‌పేట, ఏలూరు-534002, ఏలూరు జిల్లా, ఎ.పి. ఫోన్ : 98664 09192.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు (నెం.54 ఆఫ్ 2002)

దిగువ వారికి,
శ్రీ ఘంటసాల రాంజీ, తండ్రి : నాగరాజు, డి.నెం.1-42, శ్రీపర్రు గ్రామం, ఏలూరు మండలం, ఏలూరు జిల్లా, ఆం.ప్ర., ఇండియా-534004.

మీరు ఈ దిగువ ఉదహరించిన ఆస్తులను తనఖా ఉంచి మా ఏలూరు బ్రాంచి నుండి గృహఋణ సౌకర్యాన్ని పొందియున్నారు. సదరు ఋణఖాతా లో రూ.11,04,444/- (అక్షరాల పదకొండు లక్షల నాలుగు వేల నాలుగు వందల నలభై నాలుగు రూపాయలు మాత్రమే) మరియు వడ్డీతో మరియు సదరు బకాయి మొత్తంపై అంగీకరించిన కాంట్రాక్చువల్ రేటు ప్రకారం వడ్డీ + ఇతర ఖర్చులు మరియు బ్యాంకు ఛార్జీలకు మీరు సేఫ్ మూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్, ఏలూరు కు బకాయి ఉన్నారు.

అస్తి షెడ్యూలు

ఏలూరు ఎస్.ఆర్.ఓ పరిధిలో గల డాక్యుమెంట్ నెం.7205/2021 ప్రకారం శ్రీమతి ఘంటసాల రాణి, భర్త : ఘంటసాల రాంజీ గారికి చెందిన ఆస్తి : పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు ఆర్.ఓ. ఏలూరు మండలం, శ్రీపర్రు పంచాయితీ మరియు గ్రామం (డి.నెం.2-188) లో ఆర్.ఎస్.నెం.77 లో 93.5 చ॥గ॥ల విస్తీర్ణం గల ఆస్తి. హద్దులు : తూర్పు : కాకోలు సిమోను గారి స్థలం 25.0 అ॥లు, దక్షిణం : బాను రామాంజమ్మ గారి స్థలం 33.0 అ॥లు, పడమర : పంచాయితీ బజారు 26.0 అ॥లు, ఉత్తరం : మోరు రమేష్ గారి స్థలం 33.0 అ॥లు. (డి.నెం.2-188తో గల ఆర్‌సిసి భవనముతో సహా)

పైన పేర్కొనబడిన SARFAESI చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును బ్యాంకు మీకు జారీచేసినది. కాని మీకు పంపినట్టి నోటీసులు మీకు చేరక తిరిగి వెనుకకు వచ్చినది. అందువలన దిగువ సంతకందారుడు సదరు నోటీసులను ఋణగ్రహీత/లు చివరిగా తెలిపిన చిరునామాల ఆవరణల యందు అతికించడమైనది. అందువల్ల ఈ పత్రికా ప్రకటన ఇవ్వబడినది. మా జారీ షరతులు మరియు నిబంధనలు పాటించుటలో మీరు విఫలమైనందున మీ ఖాతా క్రమము తప్పి NHB మార్గదర్శకాల ప్రకారం ది.31.03.2024 నాటి నుండి ఎన్.పి.ఏగా వర్గీకరించబడినది. ఈ నోటీసు ప్రకటన తేది నుండి కాంట్రాక్చువల్ రేటు ప్రకారం 01.04.2024 నుండి వడ్డీ + ఇతర ఖర్చులు మరియు ఛార్జీలతో కలిపి పైన తెలిపిన సదరు మొత్తమును 60 దినములలో తిరిగి చెల్లించవలసినదిగా మిమ్ముల్ని కోరడమైనది. లేనియెడల ఎటువంటి తదుపరి ప్రకటన లేకుండా పైన తెలిపిన సెక్యూరిటీ పైన SARFAESI చట్టంలోని నిబంధనలు అమలు చేసేందుకు చర్యలు చేపట్టుటకు సెక్యూర్డ్ క్రెడిటర్ అగు దిగువ సంతకందారు సంసిద్ధులైతారు. ఇంకా తెలియజేయునది ఏమనగా ఋణగ్రహీతలు/హామీదారులు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించగలరు.

తేది : 11.10.2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : ఏలూరు (సేఫ్ మూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్, ఏలూరు)

సేఫ్ మూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్, ఏలూరు

రిజిష్టర్ నెం.ఎయమ్‌సి/డబ్ల్యూజి/డిసిఓ/2017/2805
కేరాఫ్ సేఫ్ నిలయం, 23ఎ-5-9, ఆర్ఆర్‌పేట పార్క్ వెనుక వైపు వీధి, ఆర్ఆర్‌పేట, ఏలూరు-534002, ఏలూరు జిల్లా, ఎ.పి. ఫోన్ : 98664 09192.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు (నెం.54 ఆఫ్ 2002)

దిగువ వారికి,
శ్రీ ఘంటసాల సింహాద్రి అప్పన్న, తండ్రి : వెంకటేశ్వరరావు, డి.నెం.1-187, గుడివాకలంక, గుడివాకలంక, పశ్చిమ గోదావరి, ఆంధ్ర ప్రదేశ్-534004.

మీరు ఈ దిగువ ఉదహరించిన ఆస్తులను తనఖా ఉంచి మా ఏలూరు బ్రాంచి నుండి గృహఋణ సౌకర్యాన్ని పొందియున్నారు. సదరు ఋణఖాతా లో రూ.16,13,761/- (అక్షరాల పదహారు లక్షల పదమూడు వేల ఏడు వందల అరవై ఒక్క రూపాయలు మాత్రమే) మరియు వడ్డీతో మరియు సదరు బకాయి మొత్తంపై అంగీకరించిన కాంట్రాక్చువల్ రేటు ప్రకారం వడ్డీ + ఇతర ఖర్చులు మరియు బ్యాంకు ఛార్జీలకు మీరు సేఫ్ మూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్, ఏలూరు కు బకాయి ఉన్నారు.

అస్తి షెడ్యూలు

ఏలూరు ఆర్.ఓ పరిధిలో గల డాక్యుమెంట్ నెం.2963/2017 ప్రకారం శ్రీ ఘంటసాల సింహాద్రి అప్పన్న, తండ్రి : వెంకటేశ్వరరావు మరియు శ్రీ ఘంటసాల నాగరాజు, తండ్రి : వెంకటేశ్వరరావు గార్లకు చెందిన ఆస్తి. : పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు ఆర్.ఓ. ఏలూరు మండలం, గుడివాకలంక గ్రామం వద్ద ఆర్.ఎస్.నెం.350 లో 193.5 చ॥గ॥ల విస్తీర్ణం గల ఆస్తి. హద్దులు : తూర్పు : పంచాయితీ బజారు 35.0 అ॥లు, దక్షిణం : ఎమ్ లక్ష్మణరావు గారి ఇంటి స్థలం 49.6 అ॥లు, పడమర : పంట బోదె 35.0 అ॥లు, ఉత్తరం : జి చక్రవర్తి గారి ఇంటి స్థలం 49.6 అ॥లు. (డి.నెం.సి1-87ఏ, సి1-87బి తో నిర్మాణాలు,అసెస్‌మెంట్ నెం.447, జాయింట్ సర్వీస్ కనెక్షన్ నెం.లు.723,1379)

పైన పేర్కొనబడిన SARFAESI చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును బ్యాంకు మీకు జారీచేసినది. కాని మీకు పంపినట్టి నోటీసులు మీకు చేరక తిరిగి వెనుకకు వచ్చినది. అందువలన దిగువ సంతకందారుడు సదరు నోటీసులను ఋణగ్రహీత/లు చివరిగా తెలిపిన చిరునామాల ఆవరణల యందు అతికించడమైనది. అందువల్ల ఈ పత్రికా ప్రకటన ఇవ్వబడినది. మా జారీ షరతులు మరియు నిబంధనలు పాటించుటలో మీరు విఫలమైనందున మీ ఖాతా క్రమము తప్పి NHB మార్గదర్శకాల ప్రకారం ది.31.03.2024 నాటి నుండి ఎన్.పి.ఏగా వర్గీకరించబడినది. ఈ నోటీసు ప్రకటన తేది నుండి కాంట్రాక్చువల్ రేటు ప్రకారం 01.04.2024 నుండి వడ్డీ + ఇతర ఖర్చులు మరియు ఛార్జీలతో కలిపి పైన తెలిపిన సదరు మొత్తమును 60 దినములలో తిరిగి చెల్లించవలసినదిగా మిమ్ముల్ని కోరడమైనది. లేనియెడల ఎటువంటి తదుపరి ప్రకటన లేకుండా పైన తెలిపిన సెక్యూరిటీ పైన SARFAESI చట్టంలోని నిబంధనలు అమలు చేసేందుకు చర్యలు చేపట్టుటకు సెక్యూర్డ్ క్రెడిటర్ అగు దిగువ సంతకందారు సంసిద్ధులైతారు. ఇంకా తెలియజేయునది ఏమనగా ఋణగ్రహీతలు/హామీదారులు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించగలరు.

తేది : 11.10.2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : ఏలూరు (సేఫ్ మూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్, ఏలూరు)

రాజకీయ ఆయుధాలు సిద్ధం


మహిషాసుర మర్దిని అలంకరణలో జంగారెడ్డిగూడెం గంగానమ్మ

దశమి నుంచే మరింత పదును

సభ్యత్వాలు, లక్ష్యాలతో జనసేన, బీజేపీలు

మెరుగైన పాలనతో కూటమి ముందుకు..

సవాళ్లను అధిగమించి లక్ష్యాలు చేరుకునేందుకు ఆరాటం

పండుగ పూటా వైసీపీది అదే బాట

నిందలు, పరనిందలు ఆ పార్టీ ఆయుధాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

విజయదశమి అంటేనే ఆయుధ పూజ. జమ్మి చెట్టు సాక్షిగా ఆయుధాలకు పూజ చేసి రంగంలోకి దిగుతారు. సరికొత్త ఆలోచనలు, మెరుగైన ఫలితాలు విజయదశమి సొంతం. వీటికోసమే ఇప్పుడు రాజకీయ పక్షాలు తమ పదునైన వాగ్దానాల ఆయుధాలకు మరింత పదును పెడుతున్నాయి. కూటమి ప్రభుత్వం పాలనను ఆరంభించి వంద రోజులు దాటింది. ఈ స్వల్పకాలంలోనే మిశ్రమ ఫలితాలను సాధించింది. అనేక సవాళ్లను ఎదుర్కొంది. ప్రతిపక్షం దుందుడుకు ఆరోపణలను తిప్పికొట్టే విషయంలో సక్సెస్ అయ్యింది. జనసేన పార్టీ సభ్యత్వ నమోదులోను క్షేత్రస్థాయిలో తనకంటూ ఒక గుర్తింపు వచ్చే దిశగా స్థానిక ఆయుధాలకే పదును పెడుతోంది. భారతీయ జనతా పార్టీ సైతం ఇదే కోణంలో ఓ వైపు సభ్యత్వాలు, మరోవైపు నామినేటెడ్ పదవుల్లో స్థానం కోసం తమ పార్టీ ఆలోచనను సరైన ఆయుధాలుగా మలిచి రంగంలోకి దిగుతోంది.ప్రజా సంక్షేమం, అరుదైన అభివృద్ధి కోసం కూటమి తహతహలాడుతోంది. ఆ దిశగానే విజయదశమి రోజు నుంచి మరిన్ని సత్ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ముందుకు దూసుకుపోతోంది.

గత ఏడాది విజయదశమికి ఆయుధాలకు చేసిన పూజ కూటమికి కలిసొచ్చింది. అఖండ విజయాన్ని చేకూర్చింది. అధికారంలోకి కాలిడిన వెంటనే ముల్లు లాంటి ఆర్థిక సంక్షోభం వెన్నాడినా, చితికిపోయినా వ్యవస్థలు కళ్ళెదుటే కనిపించగా.. వీటన్నింటిని రోజుల వ్యవధిలోనే ధైర్యంగా అధిగమించారు. సమయానికి పించన్ రాని పేదల కళ్ళల్లో సంతోషం నింపేలా పించన్ పెంచి మరీ పంచారు. జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని వ్యవస్థలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను ఆ సంక్షోభం నుంచి తప్పించి ఒకటో తేదీనే జీతాలు అందుకునే పరిస్థితి సృష్టించారు. జిల్లాల వారీగా సైతం నీరుగారిన వ్యవస్థను గాడిలో పెడుతున్నారు. చాన్నాళ్ళ తర్వాత పాడైన రోడ్లకు మరమ్మతులు నిమిత్తం నిధులు కేటాయించి వారెవ్వా అనిపించుకున్నారు. సంక్షేమ హాస్టళ్ళల్లో పేద విద్యార్థులు పడుతున్న బాధలకు చెక్ పెట్టి ఆకస్మిక తనిఖీలకు తెరలేపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు కదలడం ఆరంభించారు.

ప్రభుత్వ విభాగాల్లో పేరుకుపోయిన రాజకీయ విన్యాసాలను తరిమికొట్టి ఆ స్థానంలో ప్రజాపాలన తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కనీవినీ ఎరుగని మద్యం సరఫరా చేసి ఐదేళ్ళపాటు పేదల జీవితాలతో చెలగాట మాడిన జగన్ విధానాలను ఎండగట్టడం ఆరంభించారు. ఆస్థానంలో మద్యం విధానాన్ని మార్చి ఈనెల 16 నుంచి సరికొత్త విధానానికి శ్రీకారం చుడుతున్నారు. రైతులకు సాగునీరు అందించడంలో ఐదేళ్ళ వైఫల్యాలను తరిమికొట్టి ఆ స్థానంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని సంకల్పించడమే కాకుండా ఈనెల 16 నుంచే ఆ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇంకోవైపు ఎమ్మెల్యేలంతా ఎవరంతట వారుగా తమ తమ నియోజకవర్గాల అభివృద్ధి కార్యాచరణ పథకాలను రూపొందించుకుని వాటి అమలు దిశగా ముందుకు కదులుతున్నారు. ఈ ఏడాది విజయదశమి రోజు నుంచే మరిన్ని లక్ష్యాలు నిర్దేశించుకుని ఇంకొంత వేగంగా ముందుకు సాగాలన్న యోచనలో ఉన్నారు. కూటమి ఎమ్మెల్యేల మధ్య 'అన్నదమ్ముల' బంధం ఇప్పటిదాకా సాఫీగా సాగుతూనే ఉంది. వేలెత్తి చూపించడానికి అవకాశం లేనంతగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పోలవరం ప్రాజెక్టుకు మళ్ళీ కళ రప్పించారు. ఈ విజయదశమి అనంతరం పనులను శరవేగంగా ముందుకు నడపాలనే లక్ష్యాన్ని అందిపుచ్చుకోబోతు న్నారు. రైతులను ఆదుకునే దిశగా ధాన్యం సేకరణ, చెల్లింపుల్లో కొత్త విధానాన్ని అమలు చేయబోతున్నారు. చౌకధరల దుకాణ వ్యవస్థను మరింత కుదుటపడేలా చేయబోతున్నారు. రాజకీయపరంగా గడిచిన ఐదేళ్ళు ఒత్తిళ్ళు, బెదిరింపులు, అక్రమ కేసులను తట్టుకుని నిల బడిన వారికి సగౌరవంగా నామినేటెడ్ పోస్టులు కట్టబెట్టబోతున్నారు. అసంతృప్తి, అసహనం స్థానంలో పార్టీ అంటే మనది అనే సరికొత్త సంకేతాలకు ఈ విజయదశమి నుంచే కేడర్ యావత్తు పనిచేయాలనే కాంక్ష, ఆకాంక్ష నిలువెత్తున కనిపించాలని విజయదశమి రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయబోతున్నారు.

ప్రతిపక్షానిది మరో రూటు

ఇప్పటికే ప్రజాతీర్పుతో విలవిలలాడి క్షేత్రస్థాయిలో పోలేక, రాలేక గిలగిలలాడుతున్న వైసీపీ తన పూర్వ పద్ధతిని మార్చుకోలేదు. నేతలంతా వైసీపీని వీడి కూటమి బాట పట్టినా ఆ పార్టీ మెరుగైన పాఠాలు నేర్చుకోలేదు. పైపైకి వచ్చే ఐదేళ్ళల్లో అధికారం మాదే నంటూ గొప్పలు. కాని క్షేత్రస్థాయిలో ఆ పార్టీ పరిస్థితి రానురాను దిగజారుతోంది. స్థానిక సంస్థల కాలపరిమితి ముగిసిన తర్వాత క్షేత్రస్థాయిలో ఆ పార్టీకంటూ ప్రత్యేకించి కేడర్ ఉండేటట్టు కనిపించడం లేదు. ఇప్పటికే జిల్లా పరిషత్, నగర పంచాయతీలు, మునిసిపాలిటీల్లో తీవ్ర గందరగోళం ఏర్పడింది. పార్టీ నాయకత్వం దిశ, నిర్దేశం లేక ఎవరి గొడుగు వారే మోస్తున్నారు. దీనికి తోడు ఇప్పటికీ సోషల్ మీడియానే నమ్ముకున్న ఆ పార్టీ కూటమిపై ఇష్టానుసారం దూకుడుగా వెళ్తుంది. నిందలు, పరనిందలు పేరిట ఆయుధాలను సమకూర్చుకుంది. వీటినే మరింత పదును పెట్టి తమ లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు చేరాలన్న కొత్త కోణంలోకి మారింది. అంతేతప్ప ప్రజల విషయానికి వచ్చే సరికి వారి బాగోగుల రూపకల్పనలోను, ఇంకోవైపు మెరుగైన సూచనలు ఇవ్వడానికి ఆ పార్టీ ముందుకు రావడం లేదు. వచ్చే జనవరి నుంచి తిరిగి కార్య రంగంలోకి దిగుతామని కత్తులు నూరుతున్నారు.



రారండోయ్ వేడుక చూద్దాం..

రేపటి నుంచి చినవెంకన్న ఆశ్వయుజమాస బ్రహ్మోత్సవాలు

17న రాత్రి శ్రీవారి కల్యాణం.. 18న రథోత్సవం

ఉత్సవ రోజుల్లో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు రద్దు

ద్వారకా తిరుమల, అక్టోబరు 11 :ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కాను న్నాయి. ఈనెల 13 నుంచి 20 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. వైఖానస ఆగమాన్ని అనుసరించి పాంచాహ్నిక దీక్షతో ఏటా రెండు పర్యాయాలు బ్రహ్మోత్సవాలను జరపడం సంప్రదాయం.బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 13న ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారునిగా, పెండ్లి కుమా ర్తెలుగా చేస్తారు. 14న ధ్వజారోహణ, 16న రాత్రి 7 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం, 17న రాత్రి 8 గంటలకు శ్రీవారి తిరుకల్యాణోత్సవం, 18న రాత్రి 7గంటలకు రథోత్సవం, 19న శ్రీచక్ర వార్యుత్సవం, ధ్వజావరోహణ, 20న ఉదయం 9 గంటలకు చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి జరిగే ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని ఆలయ ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ఈనెల 13 నుంచి 20 వరకు శ్రీవారికి జరిగే నిత్యార్జిత కల్యాణాలు, సేవలు రద్దు చేస్తున్నట్లు ఈవో తెలిపారు.

రూ.12.5 కోట్లతో అభివృద్ధి పనులు

క్షేత్రానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు పలు నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. ఈక్రమంలో రూ.12.5 కోట్లతో అన్ని ఆధునిక సౌకర్యాలతో అన్ని హంగులతో దర్శనం క్యూ కాంప్లెక్స్ నిర్మాణపనులు జరుగుతున్నాయి. ఈ క్యూ కాంప్లెక్స్‌లో భక్తులు కూర్చుని వెళ్లే వీలు, టాయిలెట్స్, మంచినీరు, టీవీ వంటి సౌకర్యాలను కల్పిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్ తెలిపారు. ఆలయానికి అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు నీడ కల్పించేందుకు ప్రస్తుతం ఉన్న అనివేటి మండపాన్ని రూ.10 కోట్లు వెచ్చించి విస్తరిస్తున్నారు. అర్చకులు తెల్లవారు జామున స్వామి సేవనిమిత్తం తీర్థపు బిందె తీసుకొచ్చేలా కోనేరును నిర్మిస్తామని, క్షేత్రవైభవాన్ని తెలిపేలా శిల్పకళా సౌందర్యాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు నేతృత్వంలో ఈవో మూర్తి పర్యవేక్షణలో ఈఈ భాస్కర్ పనులు వేగవంతం చేస్తున్నారు.


ఆధునిక వసతులతో నూతన క్యూ కాంప్లెక్స్ ..సహస్ర దీపాలంకరణ భవనం

విజయానికి ప్రతీక విజయదశమి

గతంతో పోలిస్తే పెరిగిన దసరా హడావుడి

సందడి సందడిగా మార్కెట్లు

అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు

ప్రత్యేక ఆఫర్లు ప్రకటించిన కంపెనీలు


ఏలూరు వస్త్ర దుకాణంలో కొనుగోళ్ల సందడి


ఏలూరు మార్కెట్‌లో పువ్వులు కొంటున్న మహిళలు

ఏలూరుసిటీ, అక్టోబరు 11: చెడుపై విజయమే విజయదశమి.. విజయానికి ప్రతీకగా జరుపుకునే విశేషమైన పండుగ ఇది. సకల దేవతల శక్తి స్వరూపిణిగా అమ్మవారు అవతరించి మహిషాసురుని వధించిన రోజుగా వేడుకలు నిర్వహి స్తారు. ఇదే రోజున శ్రీరాముడు రావణాసురుని సంహరించినట్లుగా చెబుతుంటారు. విజయదశమి రోజునే అర్జునుడు కౌరవ సేనలను అంతమొందించి నట్టుగా కథనం. దుష్ట సంహారం జరిగిన రోజుగా విజయాలకు ప్రతీకగా ఈ పండుగను వాడవాడలా నిర్వహిస్తున్నారు. విజయాలను అందించేది విజయ దశమి పండుగగా పురాణ ఇతిహాసాల్లో ఉంది. విజయ దశమి రోజున నూతన వ్యాపారాలను ప్రారంభించడం, నూతన వస్తువులను కొనుగోలు చేస్తుంటారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన దేవాలయాల్లో అమ్మవారి పూజలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఏలూరు నగరంతో పాటు ద్వారకా తిరుమల కుంకుళ్లమ్మ, రాట్నాల కుంట రాట్నాలమ్మ, కైకలూరులో శ్యామలాంబ, పెద్దింట్లమ్మ, జంగారెడ్డి గూడెం గంగానమ్మ తదితర ఆలయాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దసరా సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక పందిళ్ళు ఏర్పాటు చేసి విగ్రహాలను ఏర్పాటు చేశారు. నిత్య భజన సంకీర్తనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మార్కెట్లో దసరా హడావుడి

జిల్లా కేంద్రమైన ఏలూరుతో పాటు జిల్లాలోని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో దసరా హడావుడి మొద లైంది. ఎక్కడ చూసినా మార్కెట్‌లు, వినియోగ దారు లతో షాపింగ్ మాల్స్ కిక్కిరిశాయి.మార్కెట్లో ఎలక్ట్రానిక్స్ వస్తువులు ,మోటార్ సైకిళ్లు, వివిధ రకాల కార్లు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఉద్యోగస్తులకు మూడు రోజులు సెలవులు రావడంతో ఊళ్లకు వెళ్లే ప్రయాణికులతో బస్టాండ్‌లు కిక్కిరిశాయి. దసరాను పురస్కరించుకుని గతేడాదితో పోలిస్తే పూల ధరలను వ్యాపారులు భారీగా పెంచేశారు. వర్షాలు పడుతుండటం వల్ల కూడా ధరలు పెరిగాయని చెబు తున్నారు. దసరా అంటే ఒకప్పుడు బంధువుల సందడితో ఇళ్ళన్నీ సందడిగా ఉండేవి. ఆటపాటలు, బంధువుల కోలాహలం, కొత్త బట్టలు, పిండి వంటలు, వేషధా రణలు, బొమ్మల కొలువులు నిర్వహించేవారు. అయితే నానాటికీ ఆ సరదాలు, సంప్రదాయాలు కరవయ్యాయి. పల్లెల్లోను గతంలో ఉన్న దసరా శోభ కానరావడం లేదు.


పండగ ప్రయాణాలు

14 నుంచి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం

ఏలూరు క్రైం, అక్టోబరు 11 : ఏలూరులోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో రెండవ బ్యాచ్ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ఈనెల 14వ తేదీన ప్రారంభించనున్నారు. 2023 సెప్టెంబరు 1వ నుంచి 150 మంది విద్యార్థులతో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు నిర్వహించారు. మొదటి బ్యాచ్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనే మొదటి ర్యాంకు, మూడో ర్యాంకు, ఆరవ ర్యాంకు, 9వ ర్యాంకులను సాధించారు. 90 శాతం విద్యార్థులు పాస్ అయ్యారు. ఎంబీబీఎస్ రెండవ బ్యాచ్‌గా మొదటి సంవత్సరం ఈనెల 14వ తేదీ నుంచి తరగతులు ప్రారంభానికి అన్ని చర్యలు చేపట్టారు. మొదటి సంవత్సరానికి 150 సీట్లకు ఇప్పటి వరకూ ఆలిండియా కోటా కింద ఉన్న 22కు సీట్లు ఉండగా 19 మంది విద్యార్థులు చేరారు. రాష్ట్ర కోటా కింద 55 సీట్లు ఉండగా 53 మంది చేరారు. కన్వీనర్ కోటా కింద 23 సీట్లు ఉండగా వాటిని భర్తీ చేయాల్సి ఉంది. ఎన్ఆర్ఐ కోటా కింద 14 సీట్లు ,సెల్ఫ్ ఫైనాన్స్ కోటా కింద ఉన్న 36 సీట్లలో అందరూ చేరారు. ఇంకా 28 సీట్లు భర్తీ చేయాల్సి ఉంది. ద్వితీయ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులకు ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ఉన్న ఆడిటోరియంలో తరగతులను నిర్వహించ డానికి చర్యలు తీసుకున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈనెల 14 నుంచి ఏలూరు జిల్లా వైద్య శాఖాధికారి కార్యాలయ ఆవరణలో ఉన్న గవర్న మెంట్ మెడికల్ కాలేజీలో తరగతులను నిర్వహించడానికి చర్యలు చేపట్టినట్టు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్ తెలిపారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

ఎస్పీ కేపీఎస్ కిశోర్


బాలికలకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి , ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, అక్టోబరు 11 : ఆడపిల్లలు కేవలం ఉపాధ్యాయులు, డాక్టర్లు ఇంజనీర్లుగా మాత్రమే కాకుండా పోలీసు, ఆర్మీ స్పోర్ట్స్ తదితర అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా ఎస్పీ కేపీఎస్ ప్రతాప్ పేర్కొ న్నారు. జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వట్లూరు టీటీడీసీలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాలికల సంరక్షణకు పాటుపడతామని అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఎస్పీ మాట్లాడుతూ బాలికలు సాధన చేస్తే సాధించలేనిది అంటూ ఏమి ఉండదన్నారు. ఏదైనా సమస్య ఎదురైన సమయంలో 1098, 100కు ఫోన్ చేయాలన్నారు. జేసీ మాట్లాడుతూ బాలికలకు సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా భరోసా నివ్వాలన్నారు. బాలికల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం తరపున వారికి పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. బాల్య వివాహాలను ఎదుర్కొని బాల్య వివాహాల నుంచి బయటపడి చదువుకుంటున్న పలువురు బాలికలు తమ అనుభవాలను వివరిస్తూ బాగా చదువుకుని ఉపాధ్యాయులుగా,ఇంజనీర్లుగా, డాక్టర్లుగా ఎదుగు తామని తెలిపారు.అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన వివిధ అంశాల్లో ప్రతిభ కన బరిచిన తొమ్మిది మంది బాలికలకు సర్టిఫికెట్స్‌ని అందజేశారు. బాల్య వివాహాల నిర్మూలనకు కృషిచేస్తున్న ఉద్యోగులకు సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం టీటీడీసీ ఆవరణలో ఎస్పీ, జేసీ మొక్కలు నాటారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఐసీడీఎస్ పీడీ పద్మావతి, మైనార్టీ సంక్షేమ అధికారి కృపావరం, బీసీ సంక్షేమ అధికారి నాగరాణి, డీసీపీవో సూర్య చక్రవేణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రా షుగర్స్ జేఎండీ అచ్యుతరామయ్య

ప్రతి ఏటా ఘనంగా ఉత్సవాలు

తణుకు, అక్టోబరు 11: ప్రతి యేటా దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని ది ఆంధ్రా షుగర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య అన్నారు. గురువారం రాత్రి సంస్థ ప్రాంగణంలో ఉత్సవాల సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటాకు నివాళుల ర్పించారు. సినీ నటులు ఎం.బెనర్జీ మాట్లాడుతూ సంస్థ ఉద్యోగులంతా ఒకే కుటుంబంలా వేడుకలు జరుపుకోవడం సంతోష మన్నారు. డాక్టర్ ధూళిపాళ ఛత్ర సత్య మహాదేవుడు, సంస్థ అడిషనల్ సెక్రటరీ పీవీఎస్ విశ్వనాథకుమార్, జనరల్ మేనేజర్ ఎ.సాంబశివరావు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి. శ్రీనివాసు, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

అప్పు డబ్బులు అడిగితే బెదిరించారు

భయంతో మహిళ ఆత్మహత్య

భీమడోలు, అక్టోబరు 11 : దాచుకున్న డబ్బులు ఇవ్వకపోగా తనపై కాల్‌మనీ కేసు పెడతానని బెదిరించడంతో భయాందోళనకు గురైన ఒక మహిళ మనస్థాపానికి చెంది ఆత్మహత్యకు పాల్పడింది. భీమడోలు మండలం ఆగడాలలంక గ్రామానికి చెందిన యాళ్ళ ప్రమీల (39) ఏలూరులో ఒక ప్రముఖ స్వీటు దుకాణంలో పని చేస్తున్నది. అక్కడ వచ్చిన సొమ్ము ఆగడాలలంక గ్రామానికి చెందిన సరిపల్లి ప్రేమ, తులసీ, తానుమోలు గ్రామానికి చెందిన ప్రేమ అన్నయ్యలు రత్నబాబు, కిరణ్‌లకు ఇచ్చింది. ఆగడాలలంకలో ఇంటి నిర్మాణం చేపట్టడంతో తన సొమ్ము తనకు తిరిగి ఇవ్వమని అడగడంతో వారు డబ్బులు ఇవ్వకపోగా కాల్‌మనీ కేసు పెడతామని వేరే కేసుల్లో ఇరికిస్తామని బెదిరించారు. దీంతో భయాందో ళనకు గురై తన ఇంట్లో ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందింది. తన మరణానికి ఆ నలుగురు కారణమని సూసైడ్ నోట్‌లో పేర్కొంది. మృతురాలి తండ్రి యాళ్ళ బాలరాజు ఇచ్చిన ఫిర్యాదుపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 11 : ఓ గుర్తు తెలియని యువకుడు ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలు పక్కన ఉన్న డ్రైయిన్‌లో మృతి చెంది పడి ఉన్నాడు. ఏలూరు రైల్వే ఎస్‌ఐ సైమన్ తన సిబ్బందితో శుక్రవారం సాయంత్రం సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతుడు సుమారు 35 ఏళ్ళ వయస్సు కల్గి 5.7 అడుగులు ఉన్నాడు. అతని కుడిచేతి మణికట్టు కింద త్రిసూలం కింద పచ్చబొట్టు ఉంది. మృతుడు నీలం, ఆరంజి రంగు గళ్ళతో కూడిన రెడీమేడ్ చొక్కా ధరించి ఉన్నాడు. రైలు నుంచి జారి పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవుల అక్రమ రవాణా..నలుగురి అరెస్టు



వేలేరుపాడు, అక్టోబరు 11: గోవులను కబేళాకు తరలిస్తున్నారన్న సమాచారంతో వేలేరుపాడు ఎస్సై కేవీ రామారావు తన సిబ్బందితో కిసి ఒక వ్యాన్‌లో తరలిస్తున్న రెండు గోవులను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తులు ఎండీ అహ్మద్, సరదాల వెంకటేశ్వరరావు, ఎస్‌కే షోయబ్, సయ్యద్ సమీర్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ పశువులను జంగారెడ్డిగూడెం పశు కబేళాకు తరలిస్తున్నారన్న సమాచారంతో మేడేపల్లి వద్ద వాహనాన్ని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

తెలంగాణ మద్యం పట్టివేత

కుక్కునూరు, అక్టోబరు 11: మండల పరిధిలోని భువనగిరిలో శుక్రవారం తెలంగాణ మద్యాన్ని పట్టుకున్నారు. కుక్కునూరు సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఆ గ్రామంలో దాడులు నిర్వహించారు. పి.ధనలక్ష్మి అనే మహిళ తెలంగాణ మద్యం అమ్ముతుండగా దాడులు జరిపి 15 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఆమెకు తెలంగాణ మద్యం సరఫరా చేసిన సీతారామ్‌నగరం గ్రామానికి చెందిన పి.అంజనరావు అనే వ్యక్తి పై కూడా కేసు నమోదు చేశారు. మండలంలో అక్రమ మద్యం ఎవరు అమ్మినా కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం

పెదవేగి, అక్టోబరు 11 : పంచాయతీ నీటిని తరలించే సమయంలో ఏర్పడిన వివాదం వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి దారితీసింది. పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం వంగూరు గ్రామానికి చెందిన బోయిన ఫణికుమార్ అనేవ్యక్తి గత ఆదివారం పంచాయతీ మోటారు నుంచి నీటిని ట్యాంకర్‌లో పట్టుకుని తీసుకెళ్తున్నాడు. ఎవ్వరికి చెప్పకుండా పంచాయతీ నీటిని తీసుకెళ్ళడంపై పంచాయతీ మోటారు ఆపరేటర్ గ్రామ సర్పంచ్‌కు చెప్పాలని సూచించాడు. అప్పటికి వివాదం సద్దుమణిగింది. ఆపై బుధవారం ఉదయం ఫణికుమార్, అతని తండ్రి ఏడుకొండలు, సోదరుడు హరి కలిసి తనపై దౌర్జన్యం చేశారంటూ మోటారు ఆపరేటర్ బ్రదర్ పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు గురువారం ఉదయం వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి పంపేశారు. దీనిపై మనస్థాపానికి గురైన ఫణికుమార్ శుక్రవారం మధ్యాహ్నం పురుగుమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబసభ్యులు అతనికి ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భవానీ మాలదారుడి మృతి

దేవరపల్లి, అక్టోబరు 11 : విజయదశమి ముందు రోజున విషాదం నెలకొంది. భవానీ మాలదారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. హైదరాబాద్‌కు చెందిన దండ యశ్వంత్ నాగప్రశాంత్ (28) రాజ మహేంద్రవరం సురక్ష ఆసుపత్రిలో ఫార్మాసిస్ట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. మూడు రోజుల కిందట రాజమహేంద్రవరానికి చెందిన స్నేహితుడు ఆకుల అభిషేక్‌తో కలిసి భవానీ మాల వేశాడు. స్నేహితుడితో కలిసి మోటార్ బైక్‌పై గురువారం విజయవాడ వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో శుక్రవారం ఉదయం వర్షం కారణంగా వేగంగా వస్తూ దేవరపల్లి మండలం యర్నగూడెం గండిచెరువు సమీపంలో జాతీయ రహదారిపై మోటార్ బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. యశ్వంత్‌కుమార్ తల డివైడర్‌ను తాకడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రశాంత్ అమ్మమ్మగారి ఊరైన అత్తిలికి మృతదేహాన్ని తరలించారు.ఆకుల అభిషేక కాలు విరగడంతో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

దేవుడా..నన్నూ తీసుకుపో..!

భర్త, కుమారుల మృతిని తట్టుకోలేక ఆత్మహత్య

కుటుంబంలో ఒక్కరూ మిగల్లేదు..

కవ్వగుంటలో అలుముకున్న విషాదం


ఆత్మహత్య చేసుకున్న దేవి మృతదేహం

పెదవేగి, అక్టోబరు 11 : " ఆ ఇంటికేదో శనిపట్టుకుంది. ఒకరి వెంట ఒకరుగా ఆ కుటుంబం మొత్తాన్ని మృత్యువు తీసుకెళ్ళిపోయింది. కుమారులిద్దరితో పాటు భర్తను గంగమ్మతల్లి పొట్టన బెట్టుకుంటే ఇప్పుడు ఆ కుటుంబంలో మిగిలిన దేవిని కూడా మృత్యువు తీసుకెళ్ళిపోయింది.." అంటూ బంధువులు చేస్తున్న ఆర్తనాదాలు కంటతడి పెట్టిస్తున్నాయి. రెండు రోజుల క్రితం పోలవరం కాల్వలో భర్త, కుమారులు ఇద్దరు మృతి చెందారు.. ఆ విషాదాన్ని తట్టుకోలేక శుక్రవారం ఆ కుటుంబంలో మిగిలిన ఏకైక వ్యకి దేవి ఆత్మహత్య చేసుకుంది. మరుగుదొడ్డిలో ఉన్న ఇనుప రాడ్డుకు చీరతో ఉరేసుకుని మృతి చెందింది. ఏలూరు జిల్లా పెదవేగి మండలం కవ్వగుంట సమీపంలో తోటల్లో శెట్టిపల్లి వెంకటేశ్వరరావు భార్య దేవి, ఇద్దరు కుమారులు మణికంఠ (15), సాయికుమార్ (12)లతో జీవనం సాగిస్తున్నారు. వారికున్న 85 సెంట్ల భూమిలో 35 సెంట్లు పోలవరం కాలువలో పోగా, మిగిలిన 50 సెంట్ల భూమి ఆధారంగా బతుకుతున్నారు. వారి నివాసం పక్కనే ప్రవహిస్తున్న పోలవరం కుడికాలువలో మణికంఠ, సాయికుమార్‌లు తరచుగా దిగి, కోడిపుంజులకు ఈత కొట్టిస్తూ పందేలకు అనువుగా సిద్ధం చేస్తుంటారు. ఇది నిత్యం జరిగే తంతే. ఆ రోజు ఏం జరిగిందో కానీ కోడిపుంజుకు ఈత కొట్టిస్తున్న మణికంఠ, సాయికుమార్‌లు కాలువలో పడిపోయారు. గమనించిన తండ్రి వెంకటేశ్వరరావు కాపాడబోయి వారితో పాటే నీటిలో మునిగి చనిపోయాడు. కట్టుకున్న భర్త, కడుపున పుట్టిన బిడ్డలు ఒక్కసారిగా మృతిచెందడంతో ఆమె తట్టుకోలేక పోయింది. ఆరోజు ఆమె రోధిస్తూనే ఉంది. రెండురోజులుగా మనోవ్యథతో కుమిలిపోయిన ఆ తల్లి చివరకు తాను కూడా తనువు చాలించింది. " గురువారమంతా రోధిస్తూనే ఉన్న ఆమె, తాము ఎవరెవరికి ఎంత సొమ్ము అప్పుగా ఇచ్చింది చెప్పిందని, ఆ విషయాలు ఇప్పుడెందుకు, తరువాత చూసుకుందామని చెప్తూ వచ్చామని, కానీ ఇలా చేస్తుందని అనుకోలేదంటూ" మృతురాలి సోదరి పద్మ బోరున విలపిస్తోంది. ఏదైనా అఘాయిత్యం చేసుకుంటుందేమోననే భయంతో ప్రతి క్షణం తన అక్క వెంటే ఉన్నానని మరుగుదొడ్డికి వెళ్ళి ఇంత పనిచేస్తుందని అనుకోలేదని ఆమె రోధిస్తోంది. ఏదో శాపం తగిలినట్టుగా మృత్యుదేవత ఆ కుటుంబంలో ఒక్కరిని కూడా మిగల్చలేదంటూ బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రెండురోజుల వ్యవధిలో మొత్తం తారు మారైందని, ఇంతటి విషాదాన్ని జీవితంలో చూడలేదని గ్రామస్థులు ఆవేదనగా చెప్తున్నారు.

నేడు విజయదశమి

దేవీ నవరాత్రులు

నేటి అలంకారం
శ్రీరాజరాజేశ్వరీ దేవి
ఆశ్వయుజ శుద్ధ నవమి/దశమి (విజయదశమి)- శనివారం



శరన్నవరాత్రి మహోత్సవాల్లో... చివరి రోజైన విజయ దశమి నాడు విజయవాడ కనకదుర్గమ్మ శ్రీరాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిస్తారు. ఆమె సకల భువన బ్రహ్మాండాలకు అధిదేవత. షోడశ మహా మంత్ర స్వరూపిణి అయిన శ్రీరాజరాజేశ్వరిని మహాత్రిపుర సుందరిగా, అపరాజితాదేవిగా భక్తులు ఆరాధిస్తారు. అపరాజితాదేవి పేరు మీద 'విజయదశమి' ఏర్పడింది. విజయాన్ని సాధించింది కాబట్టి 'విజయ' అని అంటారు. పరమ శాంత స్వరూపంతో, చిరునవ్వులు చిందిస్తూ, చెరుకుగడ చేతితో పట్టుకుని ఆమె దర్శనమిస్తుంది. మణిద్వీపంలో శ్రీపురంలో నివాసం ఉండే ఆమెను 'చింతామణి'గానూ పిలుస్తారు. పరమేశ్వరుడి అంకం ఆసనంగా... ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులను భక్తులకు ఆమె అనుగ్రహిస్తుంది. మాయామోహితమైన మానవ చైతన్యాన్ని యోగమూర్తిగా ఉద్దీపనం చేస్తుంది. అనంత శక్తి స్వరూపమైన శ్రీ చక్రానికి అధిష్ఠాన దేవత అయిన శ్రీ రాజరాజేశ్వరీ దేవిని పూజిస్తే సమస్త శక్తులూ సమకూరుతాయనీ, మన సారా కొలిస్తే బ్రహ్మజ్ఞానాన్ని ఆమె కలుగజేస్తుందనీ నమ్మిక. దసరా ఉత్సవాల సంపూర్ణ పుణ్యాన్ని భక్తులందరికీ అందించే చల్లని తల్లి దుర్గమ్మను రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో దర్శిస్తే సకల శుభాలు, విజయాలు లభిస్తాయన్నది భక్తుల విశ్వాసం. అమ్మవారిని ఎరుపు రంగు గాజులతో అలంకరించి, కుంకుమార్చన చేయడం శ్రేష్ఠం.

నైవేద్యం: పరమాన్నం, ఆరు రుచులతో కూడిన (షడ్రసోపేత) పదార్థాలు
అలంకరించే చీర రంగు: ఆకుపచ్చ, తెలుపు
వేటితో అర్చించాలి: ఎర్రటిపూలు
పారాయణ చెయ్యాల్సినవి: లలితా సహస్రనామం

వాటిని గెలవాలి!

పురాణపరంగానే కాకుండా సాంస్కృతికంగానూ ప్రాముఖ్యం ఉన్న పండుగ విజయదశమి. చెడుపై మంచి గెలిచిన రోజుగా దసరా పండుగను ఘనంగా నిర్వహిస్తారు. మానవులు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అనే అరిషడ్వర్గాలను జయించాలనీ, అదే ఈ విజయదశమి పండుగలోని అంతరార్థమనీ పెద్దలు చెబుతారు. విజయదశమి నాడు ఏది ప్రారంభించినా విజయం తథ్యం అనే విశ్వాసం ఉంది.

శమీ శత్రు వినాశినీ...

శమీ వృక్షం (జమ్మి చెట్టు)లో అపరాజితా దేవి కొలువై ఉంటుందని విశ్వాసం. విజయదశమి రోజున అపరాజితా దేవిని శమీవృక్షం వద్ద పూజించే సంప్రదాయం ఉంది. ఉద్భవించిన పవిత్రమైన దేవతా వృక్షాల్లో జమ్మి చెట్టు ఒకటని చెబుతారు. రావణ సంహారానికి ముందు శ్రీరాముడు శమీ వృక్షానికీ, అపరాజితా దేవికీ పూజలు ఆచరించాడని పురాణాలు పేర్కొంటున్నాయి. పాండవులు అజ్ఞాతవాసం ముందు తమ ఆయుధాలను శమీ వృక్షం మీద దాచారనీ, అజ్ఞాతవాసం ముగిశాక వాటిని తిరిగి తీసుకున్నారనీ మహాభారతంలో కథ ఉంది. దసరా నాడు...



శమీ శమయతే పాపం శమీ శత్రువినాశిని
అర్జునస్య ధనుర్ధారి రామస్య ప్రియదర్శిని... అనే శ్లోకం పఠించి, జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తే... శత్రు భయం తొలగి విజయం చేకూరుతుందనీ సకల కార్యసిద్ధి కలుగుతుందనీ పెద్దలు చెబుతారు.

శుభప్రదం పాలపిట్ట దర్శనం

దసరా పండుగలో శమీ వృక్షంతో పాటు పాలపిట్టకు ఉన్న ప్రాధాన్యం కూడా ఎక్కువే. పాలపిట్టను పవిత్రంగా భావించడం వెనుక ఉన్న జానపద గాథ ప్రకారం... పాండవులు అరణ్యవాసం, అజ్ఞాతవాసం పూర్తి చేసి తిరిగి వస్తూ ఉండగా, వారికి పాలపిట్ట కనిపించింది. వారు దాన్ని చూసినప్పటి నుంచీ వరుసగా అన్నీ విజయాలే కలిగాయట! అందుకే విజయ దశమి రోజున పాలపిట్టను దర్శించడం శుభప్రదంగా భావిస్తారు. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో పాలపిట్టను భక్తిప్రపత్తులతో ఆరాధిస్తారు. •



తెలుగు వారికి పండగలంటే ఎంత ముఖ్యమో.. ఆ పండగల సందర్భంలో చేసే వంటలు కూడా అంతే ముఖ్యం. పండుగల సందర్భంగా చేసుకొనే అనేక వంటలను మన పూర్వీకులు గ్రంథస్తం చేశారు. అలాంటి కొన్ని అరుదైన వంటలను దసరా పండగనాడు చేసుకోవటానికి వీలుగా మీకు అందిస్తున్నాం..



వంటిల్లు

దసరా వేళ అరుదైన వంటలు

సరడాల పాసెం

క్రీ.శ. 1800 నాటి 'వెంకటాచల విహార శతకం'లో 'సరడాల పాసెం' అనే వంటకం ప్రస్తావన ఉంది. సంస్కృతంలో వంకీల నెక్లెస్ శరణ్డ అంటారు. బహుశా అందుకే వెంకటాచల కవి తెలుగులో దీనిని తెలుగులో 'సరడు' అన్నారు. సరడాల పాసెం అంటే వంకీల దండలాగా ఒత్తి వండిన పాలతాలికల్లాంటి వంటకం. శ్రీనాథుడు రాసిన 'చిరువడముల పాయసం' కూడా ఇదే కావచ్చు. వడములంటే తాళ్ళు. సన్నని తాళ్లలా ఒత్తి కలిపితే చిరువడముల పాయసం.

కావాల్సిన పదార్థాలు

సగ్గుబియ్యం- ఒక కప్పు, బియ్యపు పిండి- రెండు కప్పులు, బెల్లం పొడి- ఒక కప్పు, పాలు- ఒక లీటరు, డ్రైఫ్రూట్స్- తగినన్ని, నెయ్యి- తగినంత ఏలకుల పొడి- ఒక చెంచా, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- ముందుగా సగ్గుబియ్యాన్ని బాగా కడిగి - రెండు గంటలు నానబెట్టాలి.
- ఒక మూకుడులో నెయ్యిని కాచి.. దానిలో డ్రైఫ్రూట్స్‌ను వేసి వేయించాలి. వాటిని బయటకు తీసి ఒక ప్లేటులో చల్లార్చాలి.
- ఆ మూకుడులోనే సగం కప్పు బెల్లం పొడి, నీళ్ల కలిపి లేత పాకం పట్టాలి. దానిలో కప్పు బియ్యం పొడి వేసి ముద్దగా చేయాలి.
- ఇలా చేసిన ముద్దను సన్నని దారపు పోగుల్లా ఒత్తుకోవాలి. వీటిని కొద్ది సేపు ఆరనివ్వాలి.
- మరో గిన్నెలో పాలను బాగా మరిగించాలి. ఈ పాలలో సగ్గుబియ్యం వేసి ఉడికించాలి. ఇలా ఉడికిన పాలలో మిగిలిన సగం కప్పు బెల్లం వేయాలి.
- ఈ మిశ్రమం చిక్కపడుతున్న సమయంలో దానిలో ముందుగా చేసి ఉంచిన బియ్యపు తాలికలను వేయాలి. ఆ తర్వాత డ్రైఫ్రూట్స్‌ను వేయాలి.



జాగ్రత్తలు
- బెల్లం పాకం పట్టే సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. పాకం ముదిరితే తాలికలు చేయటం చాలా కష్టమయిపోతుంది.
- పాలను ఎంత ఎక్కువగా కాస్తే- అంత చిక్కని పాసెం తయారవుతుంది.



ఆవపచ్చడి

ఆహారాన్ని సులభంగా అరిగించే శక్తి ఆవపచ్చడికి ఉంది. అందుకే ఒకప్పుడు పండగ రోజుల్లో ఆవపచ్చడిని తప్పనిసరిగా చేసేవారు. "ముకు మండై యేర్చు నావం జిగుర్కొను పచ్చళ్ళు" అంటూ రాయల వారు ఆముక్తమాల్యదలో ఆవకూరనీ, ఆవపచ్చడినీ జలుబు నీళ్ల వదిల్చే ముక్కుమందుగా అభివర్ణించాడు. "మిసిమి కలిగిన బంగారపు రంగు పుల్లపెరుగులో ఆవపిండి కలిపి తాలింపు పెట్టిన ఆవపెరుగుపచ్చడిని అతిథులు ఆస్వాదిస్తూ దాన్ని జుర్రుకోగానే.. ఆ ఘాటుకి మూర్ధాలదిరి, ఒర్రదనం నషాలానికి అంటిందనీ.. ముక్కుల్లోంచి పొగలు వెడలినాయనీ" అంటాడు శ్రీనాథుడు. అలాంటి ఆవపచ్చడి ఎలా చేయాలో చూద్దాం..

జాగ్రత్తలు
- ఆవాలను సన్నటి సెగ మీద వేయించాలి. ఎక్కువ వేడి తగిలితే ఆవాలు మాడిపోతాయి.
- కొందరు ఈ పచ్చడిలో తాలింపు పెడతారు. తాలింపు పెట్టకపోయినా తినటానికి చాలా బావుంటుంది.

కావాల్సిన పదార్థాలు

ఆవాలు- రెండు చెంచాలు, కూరముక్కలు- మూడు కప్పులు, కొబ్బరి తురుము- రెండు చెంచాలు, పెరుగు- మూడు కప్పులు, తరిగిన కొత్తిమీర- రెండు స్పూనులు, ఉప్పు- తగినంత

తయారీ విధానం

- ఆవాలను దోరగా వేయించి.. వాటిని మిక్సీలో పొడి చేయాలి.
- కూరముక్కలను నీళ్లలో కానీ కుక్కర్‌లో కానీ మెత్తపడేదాకా ఉడకపెట్టాలి. ఆ తర్వాత బయటకు తీసి చల్లార్చాలి.
- ఒక గిన్నెలో చల్లారిన కూరముక్కలు, పెరుగు, కొత్తిమీర, కొబ్బరి తురుము, ఉప్పు వేసి బాగా కలపాలి. దీనిలో ఆవాల పొడిని కలపాలి.
- ఈ పచ్చడిని గంట సేపు మూతపెట్టి మగ్గనివ్వాలి. దీని వల్ల ఆవ ఘాటు పచ్చడి అంతా వ్యాపిస్తుంది.

అంగరొల్లెలు

'అంగ' అంటే కాల్చు, కప్పు అని రెండర్థాలున్నాయి. ఒల్లె అంటే మృదువైనదని అర్థం. మంటలో కాల్చిన తర్వాత మృదువుగా ఉండే తత్వం ఉంది కాబట్టి శ్రీనాథుడు వీటిని అంగర పూవియలు అన్నాడు. ఉత్తర భారత దేశంలో వీటిని చోఖాబాటీ అంటారు. వీటిని వంకాయ బజ్జీ పచ్చడితో కలిపి తింటారు.

కావాల్సిన పదార్థాలు

శనగపిండి- ఒక కప్పు, జీలకర్ర- అర స్పూను, వాము- పావు స్పూను, ఎర్రకారం- ఒక స్పూను, సన్నగా తరిగిన అల్లం- అర స్పూను, పచ్చిమిర్చి- ఒక స్పూను, వెల్లుల్లి- రెండు రెబ్బలు, సన్నగా తరిగిన కొత్తిమీర- ఒక స్పూను, సైంధవ లవణం- పావు స్పూను, నిమ్మ రసం- రెండు స్పూనులు, నెయ్యి- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- శనగపిండిని నీళ్ల పోసి గట్టిగా కలిపి చిన్న చిన్న ఉండలుగా చేయాలి.
- జీలకర్ర, వాము, ఎర్రకారం, అల్లం, పచ్చిమిర్చి, వెల్లుల్లి, కొత్తిమీర, సైంధవ లవణం, నిమ్మరసంలను ఒక గిన్నెలో వేసి స్పూనుతో మెత్తగా చేయాలి.
- శనగపిండి ఉండలను పూరీల మాదిరిగా ఒత్తాలి. వీటిలో తయారుచేసిన మిశ్రమాన్ని పెట్టి- చిన్న చిన్న ఉండలుగా చేయాలి. వీటికి నెయ్యి రాయాలి.
- ఈ ఉండలను బొగ్గు మీద కాల్చాలి. ఒక వేళ బొగ్గులు లేకపోతే గ్యాస్‌స్టౌవ్ మీద గ్రిల్ పెట్టి సన్నటి మంటపైన కాల్చాలి.
- కాల్చిన తర్వాత పైన నల్లగా ఒక పొర ఏర్పడుతుంది. ఆ పొరను వలిచి తినాలి.



జాగ్రత్తలు
- శనగపిండిని కలిపే సమయంలో ఉండలు లేకుండా చూసుకోవాలి.
- అంగరొల్లెలను కాల్చే సమయంలో జాగ్రత్తగా ఉండాలి. ఎక్కువ మంటపై కాలిస్తే బొగ్గులా మారిపోతుంది.



చెఫ్: **వి.నగేష్**
వివాహ భోజనంబు
జూబ్లీహిల్స్, హైదరాబాద్
99899 61488



అలనాటి కథ

నాకు తెలిసిన రతన్ టాటా!

గురువారం ఉదయం మామూలుగానే లేచా.. లేచిన వెంటనే పత్రికలు చూడటం అలవాటు. పేపరు తెరిచిన వెంటనే 'రతన్ టాటా ఇక లేరు' అనే హెడ్డింగ్ కనిపించింది. ఒక్క నిమిషం షాక్ తగిలినట్లు అనిపించింది. వెంటనే ప్రిన్సెస్ ఏస్రాకు మెసేజ్ పంపించాను. తనకు కూడా ఆ దుర్వార్త తెలియదు అనుకుంటా! షాక్ తింది. రతన్ టాటాతో మా అనుబంధం ఈనాటిది కాదు.



మాకు ముంబాయిలో ప్యాలెస్ ఉంది. ఈ ప్యాలెస్‌లో నాన్న రాజా ధన్‌రాజ్‌గిరి పార్టీలు ఇస్తూ ఉండేవారు. ఈ పార్టీలకు ముంబాయిలో ఉన్న రాజ కుటుంబీకులు, పార్సీ వాణిజ్యవేత్తలు, రాజకీయ నాయకులు- ఇలా అనేక మంది హాజరవుతూ ఉండేవారు. ఇలా నాకు జేఆర్‌డీ టాటా తెలుసు. ఆయన భార్య కూడా తెలుసు. ఆమె అప్పుడప్పుడు మమ్మల్ని వాళ్లింటికి మధ్యాహ్న భోజనాలకు పిలిచేది. మంచి పార్సీ వంటలు వండించి పెట్టేది. జేఆర్‌డీ ద్వారా మాకు నోవెల్ టాటా, ఆయన భార్య సినోమి కూడా తెలుసు. వారితో పాటుగా రతన్ టాటా కూడా పరిచయం ఏర్పడింది. ఆ రోజుల్లో ముంబాయి- ఇప్పుడున్నంత హడావిడిగా ఉండేది కాదు. సాయంత్రాలు అనేక మంది బీచ్ ఒడ్డున కూర్చుని స్నేహితులతో కబుర్లు చెప్పుకుంటూ ఉండేవారు. నేను కూడా అప్పుడప్పుడు స్నేహితులతో కలిసి బీచ్‌లకు వెళ్తూ ఉండేదాన్ని. ఆ సమయంలో నాకు ఉన్న స్నేహితురాలు లీనా భక్తావర్‌లో ఒక ఫ్లాట్‌లో నివసించేది. ఆ ఫ్లాట్లలోనే రతన్ కూడా నివసించేవాడు. లీనా దగ్గరకు వెళ్లినప్పుడు ఎదురుపడేవాళ్లం. మాట్లాడుకొనేవాళ్లం. ఇక నా చెల్లెలు రేణుకకు తన క్లాస్‌మేట్ అనుకుంటా. అందుకే అప్పుడప్పుడు రతన్ గురించి ప్రస్తావన వచ్చేది. రతన్ చూడటానికి అందంగా, హుందాగా ఉండేవాడు. తక్కువగా మాట్లాడేవాడు. తండ్రి మాట జవదాటడని చెప్పుకుంటూ ఉండేవాళ్లం. బహుశా అందుకే తనకు ఇష్టం లేకపోయినా అమెరికా నుంచి వచ్చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ తర్వాతి కాలంలో నేను హైదరాబాద్ వచ్చేసాను. మాకు కొంత మంది కామన్ ఫ్రెండ్స్ ఉన్నా- ఎక్కువ సార్లు కలవలేదు.

రతన్‌ను నేను మళ్లీ కలిసింది- ఫలక్ నామా ప్యాలెస్ ప్రారంభోత్సవంలో. టాటా గ్రూపునకు చెందిన తాజ్ హోటల్స్ ఈ ప్యాలెస్‌ను లీజ్‌కు తీసుకొని హోటల్‌గా పునరుద్ధరించారు. దీని ప్రారంభోత్సవానికి దేశంలోని అనేక మంది ప్రముఖులు హాజరయ్యారు. టాటా గ్రూపు ఛైర్మన్ హోదాలో రతన్ కూడా వచ్చారు. ఆ సమయంలో మళ్లీ తనను కలిసాను. కాలేజీలో ఉన్నప్పుడు ఎంత హుందాగా ఉన్నాడో.. అంతే హుందాగా ఉన్నాడు. ఆప్యాయంగా పలకరించాడు. ఆ తర్వాత మేమిద్దరం పెద్దగా కలసినది లేదు. కానీ తన వ్యక్తిత్వంతో ఒక చెరగని ముద్ర వేశాడు. నాకు తెలిసి- శత్రువులు లేని అతి కొద్ది మంది వ్యక్తుల్లో రతన్ కూడా ఒకరు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. 1962లో ఇండో-చైనా యుద్ధం జరుగుతున్న సమయంలో అనుకుంటా- రతన్ అమెరికాలో ఒక అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. కానీ రతన్ కొన్ని కారణాల వల్ల భారత్‌కు తిరిగి వచ్చేయాల్సి వచ్చింది. ఆ అమ్మాయి ఇండియాకు రాలేని పరిస్థితి. దాంతో ఆ పెళ్లి ఆగిపోయింది. ఆ సమయంలో ముంబాయి సోషల్ సర్కిల్స్‌లో అదొక పెద్ద వార్త. కారణం తెలియదు కానీ- ఆ తర్వాతి కాలంలో రతన్ ఎవరినీ పెళ్లి చేసుకోలేదు. ఒంటరిగానే మిగిలిపోయాడు. ఆ ఒంటరితనాన్ని కూడా హుందాగా గడిపాడు. తాను చిన్నప్పటి నుంచి నేర్చుకున్న విలువలను తుదిదాకా వీడని అతి కొద్ది మందిలో రతన్ ప్రథమ స్థానంలో ఉంటాడనటంలో ఎటువంటి సందేహం లేదు!

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

భోజన విధి

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

ఆయుర్వేద సంహితా గ్రంథాల యుగం తరువాత ఆహార ప్రాధాన్యతని వివరిస్తూ 15వ శతాబ్దిలో క్షేమశర్మ- "క్షేమకుతూహలం". 15వ శతాబ్దిలో పండిత రఘునాథ సూరి "భోజనకుతూహలం" గ్రంథాలను వెలువరించారు. క్షేమకుతూహలంలో లేని అనేక ఆహారవైద్య విషయాలు భోజనకుతూహలంలో ఉన్నాయి. 1678లో తంజావూరులో మరాఠా రాజ్యస్థాపన చేసిన ఏకోజీ (శివాజీ సవతి సోదరుడు) రాణి దీపాంబికల ప్రోత్సాహంతో రఘునాథ పండితుడు భోజన కుతూహలం రాశాడు. తంజావూరులోనే నివసించాడు. అక్కడి తెలుగు వారితో పరిచయం కారణంగా భోజన కుతూహలంలో తెలుగుదనం కనిపిస్తుంది. ఇది సంస్కృత రచనే అయినా మనకు దగ్గరగా ఉంటుంది. కుతూహలం అంటే ఉత్సాహం, కోరిక అనే కాదు, అద్భుతమైన, ఉన్నతమైన, గొప్పదైన, ప్రశంసనీయమైన అనే అర్థాలు కూడా ఉన్నాయి. భోజనం తయారీ, దాన్ని వడ్డించటం, తినటం లాంటి విషయాల్లోని శాస్త్రీయతను వివరించటమే ఈ భోజనకుతూహలం లక్ష్యం.

అన్నమే ప్రాణాన్నిస్తోంది. అన్నమే సమస్త జీవులకూ పోషణ నిస్తోంది. ఆయుష్షునిస్తోంది. ఈ సృష్టి మొత్తాన్ని సంరక్షిస్తోంది. అన్నం లేకపోతే జీవి లేడు, జీవం లేదు. ప్రాణదాత అయిన అన్నానికి దణ్ణాలు చెపుజి;కుంటూ రఘునాథ సూరి షుమారుగా 350 ఏళ్ల క్రితం రాసిన భోజన కుతూహలం గ్రంథం కుతూహలం కలిగించే అనేక ఆహార విషయాల సమాహారంగా సాగుతుంది. "ఇతి వ్యాసస్మరణాచ్చ భోజనద్రవ్యాణి తద్గుణాశ్చభిధీయతేఖ"- ఈ విధంగా వ్యాసభగవానుణ్ణి స్మరించుకుంటూ, భోజన ద్రవ్యాలు, వాటి గుణాలు చక్కగా వివరిస్తానని సంకల్పం చెప్పుకొని భోజనకుతూహలం గ్రంథాన్ని ప్రారంభిస్తాడు పండిత రఘునాథ సూరి.

"జీర్ణే హితం మితం చాద్యాత్ ఇత్యాయుర్వేదోపదేశాత్
భోక్తవ్యం సఘృతం సోష్ణం హితమ్ పథ్యం మితం తథాఖ!"

అనే శ్లోకంలో ఎలాంటి ఆహారాన్ని తినాలనే విషయాన్ని వర్ణిస్తాడు, దీనిలో కొన్ని ముఖ్యమైన అంశాలున్నాయి.

జీర్ణశక్తి ఆధారంగా..

సాధారణంగా తేలికగా జీర్ణమయ్యే పదార్థాలే తినాలి. మన జీర్ణశక్తి ఎంత సమర్థమైనదో దాన్ని బట్టి తీసుకోదగిన ఆహారాన్ని ఎంచుకోవాలి. పర్వతాలు ఫలహారం చేయగలంత జీర్ణశక్తి ఉన్నవారికి ఏది తిన్నా చెల్లిపోతుంది. కానీ కడుపులో జాఠరాగ్ని అరకొరగా ఉన్నప్పుడు ఏదో ఒక సమస్య బాధిస్తూనే ఉంటుంది సమస్తమైన అనారోగ్యాలకూ జీర్ణశక్తి వైఫల్యమే మొదటి కారణం. కాబట్టి ప్రయత్న పూర్వకంగా అగ్నిబలం కాపాడలంటుంది శాస్త్రం.

జీర్ణే అంటే ఒకసారి తీసుకున్న ఆహారం పూర్తిగా అరిగాకే మరో ఆహారం తినాలని.

నాలుగు సూత్రాలు

"సఘృతం సోష్ణం హితమ్ పథ్యం" అంటూ ఆహారానికి సంబంధించి నాలుగు సూత్రాలను రఘునాథ పండితుడు వివరిస్తున్నాడు. అవి

1) కల్తీ లేని మంచి నెయ్యితో భోజనం
2) వేడిగా తాజాగా ఉన్న ఆహారం
3) సరిపడే పదార్థాలను తెలుసుకుని తినటం
4) మోతాదెరిగి మితంగా తినటం

హితవైన ఆహారం

తినబోయే ముందు ఆ పదార్థం మన శరీరానికి సరిపడుతుందో.. లేదో కూడా ఆలోచన చేయాలి. ఒకప్పటికన్నా ఎలర్జీ రోగుల సంఖ్య ఇప్పుడు ఎక్కువగా ఉంది. ఎలర్జీ తీవ్రతను తగ్గించాలంటే ఆచితూచి తినటం అవసరం.

మితాహారం: ఏ పదార్థాన్నయినా మితంగానే తినాలి. ఒకే పదార్థాన్ని అదేపనిగా తింటే వికటిస్తుంది. ఆహారం అనేది ఔషధం కాబట్టి మోతాదెరిగి తీసుకోవాలి.

ఆద్యం: ఆద్యం అంటే అన్ని పోషకాలూ కలిగి ఆరురుచులతో కూడిన రాజభోజనం అని!

ఆయుర్వేదం వివిధ ఆహార ద్రవ్యాలలోని పోషకాలను వాటికి గల రుచులను బట్టి నిర్ణయిస్తుంది.
మనం తినే మొత్తం అన్నంలో తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు ఈ ఆరు రుచులూ ఉండేలా చూసుకుంటే అది 'ఆద్యం'.



రతన్ టాటా వారసుడిగా నోయల్ టాటా

టాటా ట్రస్ట్స్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎంపిక

- వెంటనే అమల్లోకి వచ్చిన నియామకం
- రతన్ టాటా సవతి సోదరుడే నోయల్
- నలభై ఏళ్లకుపైగా టాటా గ్రూప్‌తో అనుబంధం



ముంబై: టాటా గ్రూప్‌లో వారసత్వ పగ్గాల బదిలీ ప్రశాంతంగా జరుగుతోంది. టాటా ట్రస్ట్ కొత్త చైర్మన్‌గా రతన్ టాటా సవతి సోదరుడు నోయల్ టాటా (67) నియమితులయ్యారు. ముంబైలో శుక్రవారం జరిగిన టాటా ట్రస్ట్ ట్రస్టీల సమావేశం ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ ట్రస్టులకు టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్ ఈక్విటీలో 66 శాతం వాటా ఉంది. దాదాపు ఈ ట్రస్టులన్నిటిలో నోయల్ టాటా ఇప్పటికే ట్రస్టీగా ఉన్నారు. కొత్త చైర్మన్‌గా నోయల్ టాటా నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని టాటా ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది. 'రతన్ టాటా, టాటా గ్రూప్ వ్యవస్థాపకుల వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు ఎదురు చూస్తున్నా' అంటూ ఈ ప్రకటన వెలువడిన వెంటనే నోయల్ టాటా ట్వీట్ చేశారు.

2012లోనే తెరపైకి పేరు

ప్రచారానికి దూరంగా ఉండే నోయల్ టాటా పేరు నిజానికి 2012లోనే రతన్ టాటా తర్వాత టాటా గ్రూప్ చైర్మన్‌గా తెరపైకి వచ్చింది. అయితే అప్పట్లో ఆయన తన బావమరిది సైరస్ మిస్త్రీకి ఈ పదవి కట్టబెట్టేందుకు వీలుగా ఆ పదవిపై పెద్దగా ఆసక్తి చూపలేదంటారు. ఇప్పుడు రతన్ టాటా, సైరస్ మిస్త్రీ ఇద్దరూ లేకపోవడంతో ఇక టాటా గ్రూప్ సారధ్యం స్వీకరించేందుకు నోయల్ టాటా కాదనలేదని సమాచారం.

టాటాల మనిషే

రతన్ టాటా సవతి సోదరుడైన నోయల్ టాటాకు.. టాటా గ్రూప్‌తో నలభై ఏళ్లకుపైగా అనుబంధం ఉంది. టాటా గ్రూప్ రిటైల్ కంపెనీ 'ట్రెంట్' బహుముఖ విస్తరణలో నోయల్ టాటాది కీలక పాత్ర. 1998లో ఒక స్టోర్‌తో ప్రారంభించి వివిధ ఫార్మాట్లలో ఆ సంస్థను 700కుపైగా స్టోర్లకు విస్తరించారు. వెస్ట్‌సైడ్, జుడియో, క్రోమాతో పాటు ఇటీవల టాటాల గూటికి చేరిన బిగ్ బాస్కెట్ వంటి కంపెనీలన్నీ ట్రెంట్ గొడుకు కిందే పనిచేస్తాయి. లిస్టెడ్ కంపెనీ అయిన ట్రెంట్ ప్రస్తుత మార్కెట్ క్యాప్ రూ.1.81 లక్షల కోట్ల వరకు ఉంది. ఇదిగాక టాటా గ్రూప్ కంపెనీలైన వోల్టాస్, టాటా ఇంటర్నేషనల్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ వంటి అనేక టాటా గ్రూప్ కంపెనీలకూ నోయల్ చైర్మన్‌గా ఉన్నారు. వీటికి తోడు టాటా స్టీల్, టైటాన్ కంపెనీలకు వైస్ చైర్మన్‌గానూ నోయల్ టాటా వ్యవహరిస్తున్నారు.

కుటుంబ నేపథ్యం

నావెల్ హెచ్ టాటా.. నోయల్ టాటా తండ్రి. తల్లి సిమోన్ హెచ్ టాటా స్విట్జర్లాండ్‌కు చెందిన వ్యాపారవేత్త. సిమోన్ హెచ్ టాటా కంటే ముందే నావెల్ హెచ్ టాటా రతన్ టాటా తల్లి సూనూ కమిశారియట్‌ను వివాహం చేసుకున్నారు. ఆ పెళ్లి ద్వారా నావెల్ హెచ్ టాటాకు రతన్, జిమ్మీ జన్మించారు. ఈ ముగ్గురు అన్నదమ్ముల్లో నోయల్ టాటా మాత్రమే వివాహితుడు. రతన్ టాటా, జిమ్మీ టాటా అవివాహితులు. నోయల్ టాటా భార్య ఆలూ మిస్త్రీ.. రతన్ టాటా తర్వాత టాటా గ్రూప్ పగ్గాలు చేపట్టిన సైరస్ మిస్త్రీకి స్వయానా సోదరి. షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ అధినేత పల్లోంజీ మిస్త్రీ కుమార్తె. షాపూర్జీ పల్లోంజీ కుటుంబానికి టాటా సన్స్‌లో 18.4 శాతం వాటా ఉన్న సంగతి తెలిసిందే. అంతేకాదు టాటా సన్స్‌లో షాపూర్జీ పల్లోంజీ కుటుంబం అతిపెద్ద ప్రైవేట్ వాటాదారుగా ఉంది. నోయల్ టాటా-ఆలూ మిస్త్రీ దంపతులకు లీ, మాయ అనే కుమార్తెలతో పాటు నెవిల్లే అనే ఒక కుమారుడు ఉన్నారు. ఇందులో లీ టాటా.. ప్రస్తుతం తాజ్ హోటల్స్‌ను నిర్వహించే ది ఇండియన్ హోటల్స్ వైస్ ప్రెసిడెంట్‌గా, మాయా టాటా క్యాపిటల్ కంపెనీలో ఉన్నత స్థానాల్లో పని చేస్తున్నారు. కుమారుడు నెవిల్లే కూడా ట్రెంట్, స్టార్ బజార్ సారధ్య బాధ్యతలు చూసుకుంటున్నారు.

ఆదాయ పన్ను వసూళ్లలో 18 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను (ఐటీ) నికర వసూళ్లు అక్టోబరు 10వ తేదీ నాటికి 18.3 శాతం పెరిగి రూ.11.25 లక్షల కోట్లకు చేరాయి. అందులో వ్యక్తిగత ఐటీ వసూళ్లు రూ.5.98 లక్షల కోట్లు కాగా కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.4.94 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇవికాకుండా సెక్యూరిటీ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) రూపంలో రూ.30,630 కోట్లు, ఇతర పన్నులు రూ.2150 కోట్లు ఉన్నాయి. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన పన్ను వసూలు మొత్తం రూ.9.51 లక్షల కోట్లు. కాగా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అక్టోబరు 10వ తేదీ మధ్య కాలంలో పన్ను రిఫండ్స్ మొత్తం రూ.2.31 లక్షల కోట్లుంది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఇది 46 శాతం అధికం. స్థూల ప్రాతిపదికన ప్రత్యక్ష పన్ను వసూళ్లు 22.3 శాతం పెరిగి రూ.13.57 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇందులో వ్యక్తిగత ఐటీ వసూలు రూ.7.13 లక్షల కోట్లు కాగా కార్పొరేట్ పన్ను వసూలు రూ.6.11 లక్షల కోట్లుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల రూపంలో మొత్తం రూ.22.07 లక్షల కోట్లు వసూలు చేయాలన్నది ప్రభుత్వం బడ్జెట్లో నిర్దేశించిన లక్ష్యం.

తగ్గిన ఫారెక్స్ నిల్వలు

న్యూఢిల్లీ: విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు అక్టోబరు 4తో ముగిసిన వారంలో 370.9 కోట్ల డాలర్ల మేరకు తగ్గి 70,117.60 వద్ద స్థిరపడ్డాయని ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడించాయి. అంతకు ముందు వారంలో ఇవి చారిత్రక గరిష్ఠ స్థాయి 70,488.50 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. ఇదే వారంలో బంగారం నిల్వలు 4 కోట్ల డాలర్ల మేరకు దిగజారి 6,575.6 కోట్ల డాలర్ల వద్ద స్థిరపడ్డాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,400 ▲	70,950 ▲	1,02,000 ▲
ముంబై	75,623 ▲	69,271 ▲	89,963 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	525
చిత్తూరు	538	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	114	విజయవాడ	125
వరంగల్	114	గుంటూరు	125
కరీంనగర్	114	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	126
కర్నూలు	114	నెల్లూరు	126
విశాఖపట్నం	120	అనంతపురం	126
గోదావరి	125		

పారిశ్రామికం నేలచూపు

న్యూఢిల్లీ: సుమారు రెండు సంవత్సరాల అనంతరం దేశంలో పారిశ్రామికోత్పత్తి ఆగస్టు నెలలో తొలిసారిగా ప్రతికూల వృద్ధిలో ప్రవేశించింది. మైనింగ్, విద్యుదుత్పత్తి రంగాల ఉత్పత్తి క్షీణత కారణంగా పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) గత ఏడాది ఆగస్టుతో పోల్చితే మైనస్ 0.1 శాతానికి దిగజారింది. జూలై నెల పారిశ్రామికోత్పత్తి వృద్ధి రేటును కూడా 4.8 శాతం నుంచి 4.7 శాతానికి కుదించారు. గత ఏడాది ఆగస్టులో ఐఐపీ వృద్ధి రేటు 10.9 శాతం ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఆగస్టు నెలల మధ్య కాలంలో ఐఐపీ వృద్ధి రేటు 4.2 శాతానికి పరిమితమైంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది 6.2 శాతంగా ఉంది. ఈ ఆగస్టులో మైనింగ్ రంగం మైనస్ 4.3 శాతం, తయారీ రంగం 0.1 శాతం, విద్యుత్ రంగం మైనస్ 3.7 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2022 అక్టోబరులో నమోదైన 4.1 శాతం ప్రతికూల వృద్ధి తర్వాత ఐఐపీ నెగిటివ్ జోన్‌లోకి రావడం ఇదే ప్రథమం.

అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లో మార్కెట్

ముంబై: పారిశ్రామికోత్పత్తి గణాంకాలు వెలువడడానికి ముందు ఇన్వెస్టర్లలో నెలకొన్న అప్రమత్తత, అమ్మకాల ఒత్తిడి ప్రభావంతో శుక్రవారం స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. కొద్ది రోజులుగా విదేశీ నిధులు తరలిపోతూ ఉండడం, రూపాయి బలహీనత, ప్రపంచ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. బ్యాంకింగ్, యుటిలిటీ, ఫైనాన్షియల్ విభాగాల షేర్లలో ఇన్వెస్టర్లు అమ్మకాలు సాగించారు. అయితే మెటల్ విభాగం షేర్లలో జోరుగా కొనుగోళ్లు సాగడంతో నష్టాలు కొంత మేరకు పరిమితం అయ్యాయి. మొత్తం మీద ఆటుపోట్లతో సాగిన పయనంలో సెన్సెక్స్ 230.05 పాయింట్ల నష్టంతో 81381.36 వద్ద ముగియగా నిఫ్టీ 34.20 పాయింట్ల నష్టంతో 24,964.25 వద్ద ముగిసింది. మార్కెట్‌ను ఉత్తేజపరిచే వార్తలేవీ లేకపోవడం వల్ల ట్రేడింగ్ పూర్తిగా సైడ్‌వేస్ ధోరణిలో సాగిందని విశ్లేషకులంటున్నారు.

ట్రాఫిక్‌సోల్ ఐటీఎస్ టెక్నాలజీస్‌పై సెబీ దర్యాప్తు: ఎస్ఎంఈ విభాగంలోని ట్రాఫిక్‌సోల్ ఐటీఎస్ టెక్నాలజీస్ షేర్ల లిస్టింగ్‌ను నిలిపివేయాలని బీఎస్ఈని సెబీ ఆదేశించింది. ఐపీఓకు అనుమతి కోరుతూ సమర్పించిన దరఖాస్తులో సంస్థ చేసినట్టు చెబుతున్న తప్పుడు ప్రకటనలపై సవివరమైన దర్యాప్తు చేపట్టాలని సెబీ నిర్ణయించింది. ఈ దర్యాప్తు 30 రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని సెబీ గడువు పెట్టింది. ఆ సంస్థ ఐపీఓ ద్వారా సేకరించిన సొమ్మును వడ్డీ ఆర్జించే ఎస్క్రో ఖాతాలో భద్రపరచాలని బీఎస్ఈకి సూచించింది. ఎస్ఎంఈ వేదిక ద్వారా కంపెనీ షేర్ల లిస్టింగ్‌ను బీఎస్ఈ వాయిదా వేసిన 30 రోజుల అనంతరం సెబీ నుంచి ఈ ఆదేశాలు వెలువడ్డాయి. రూ.66-70 ధరల శ్రేణిలో జారీ అయిన ఈ ఐపీఓకి 345 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్ లభించింది. రూ.45 కోట్లు వసూలు చేయాలన్నది లక్ష్యం కాగా రూ.10,000 కోట్లకు పైబడిన బిడ్లు దాఖలయ్యాయి.

- బర్నర్స్ తయారీ కంపెనీ మయూఖ్ డీల్ ట్రేడ్ లిమిటెడ్.. రైట్స్ ఇష్యూ ద్వారా రూ.49 కోట్లు సమీకరించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కంపెనీ బోర్డు ఆమోదం లభించిందని తెలిపింది. అలాగే రూ.5 ముఖ విలువతో కూడిన ప్రతి షేరును రూ.1 ముఖ విలువతో కూడిన ఐదు షేర్లుగా విభజించేందుకు కూడా బోర్డు ఆమోదం లభించిందని వెల్లడించింది.

ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి

ముంబై: ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు రోజురోజుకీ కుదేలవుతోంది. శుక్రవారం మరో 12 పైసలు నష్టపోయి రూ.84.10 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం రేటు ఇంత కనిష్ఠ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. శుక్రవారం ఉదయం గురువారంతో పోలిస్తే ఒక పైసా నష్టంతో రూ.83.97 వద్ద కొద్దిగా మెరుగ్గానే ప్రారంభమైనా ఇంట్రాడేలో రూ.83.96-84.10 మధ్య ట్రేడైంది. చివరికి గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.84.10 వద్ద ముగిసింది. స్టాక్ మార్కెట్లో కొనసాగుతున్న ఎఫ్‌పీఐల అమ్మకాలు, పశ్చిమాసియా ఉద్రిక్తతలతో మండుతున్న చమురు ధర ఇందుకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

టయోటా కిర్లోస్కర్ కొత్త అర్బన్ క్రూయిజర్ హైరైడర్



బెంగళూరు: టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) మార్కెట్లోకి ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్ అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌ను విడుదల చేసింది. ప్రీమియం యాక్సెసరీస్ ప్యాకేజీ, స్మార్ట్‌నెస్, మరింత కంఫర్ట్‌తో దీన్ని తీసుకువచ్చింది. జీ, వీ వేరియంట్స్‌తో హైబ్రిడ్, నియో డ్రైవ్ పవర్‌ట్రెయిన్స్‌తో ఇది అందుబాటులో ఉండనుంది. దేశవ్యాప్తంగా ఉన్న టయోటా డీలర్‌షిప్ కేంద్రాల్లో సమగ్ర ప్యాకేజీతో ఈ అర్బన్ క్రూయిజర్ అందుబాటులో ఉంటుందని టీకేఎం వెల్లడించింది.

- జేఎం ఫైనాన్షియల్ హోమ్ లోన్స్ లిమిటెడ్ (జేఎంఎఫ్‌హెచ్ఎల్ఎల్).. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను మరింతగా విస్తరించింది. ఇందులో భాగంగా ఏలూరులో కంపెనీ కొత్త శాఖను ప్రారంభించింది. జేఎంఎఫ్‌హెచ్ఎల్ఎల్‌కు రాష్ట్రంలో ఇది 10వ శాఖ. ఈ కొత్త శాఖ ఏర్పాటుతో దేశవ్యాప్తంగా మొత్తం బ్రాంచీల సంఖ్య 126కి చేరింది.
- ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ అల్ట్రావయోలెట్.. ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా విశాఖపట్నంలో తొలి యూవీ స్పేస్ స్టేషన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. ఈ సెంటర్‌లో 10.3 కిలోవాట్ ఎస్ఆర్‌బీ7 లిథియం అయాన్ బ్యాటరీతో కూడిన ఎఫ్77 మాక్ 2 ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ అందుబాటులో ఉంటాయి.
- ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ కంపెనీ వారివో మోటార్ ఇండియా.. బ్యాటరీ స్మార్ట్‌తో జట్టు కట్టింది. ఒప్పందంలో భాగంగా బీ2బీ ఎలక్ట్రిక్ మొబిలిటీ కోసం బ్యాటరీ స్వాపింగ్ టెక్నాలజీని బ్యాటరీ స్మార్ట్ అందించనుంది. వచ్చే ఏడాది చివరి నాటికి బీ2బీ విభాగంలో 20 వేల స్కూటర్లను విక్రయించాలని వారివో లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వాహనాలకు అవసరమైన బ్యాటరీ స్వాపింగ్ సేవలను అందించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని వారివో భావిస్తోంది.

స్పోర్ట్స్



టీమిండియా క్రికెటర్ మహ్మద్ సిరాజ్ డీఎస్పీగా విధుల్లో చేరాడు. శుక్రవారం హైదరాబాద్‌లో డీజీపీ జితేందర్ రెడ్డిని ఆయన కార్యాలయంలోనే మర్యాదపూర్వకంగా కలిసి జాయినింగ్ రిపోర్టును అందించాడు. రాష్ట్ర కేబినెట్ తీర్మానం మేరకు నిబంధనలను సడలించి, ప్రత్యేక జీఓ విడుదల చేసి సిరాజ్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చారు.



ఆస్ట్రేలియా హ్యాట్రిక్

9 వికెట్లతో పాకిస్థాన్‌పై గెలుపు
మహిళల టీ20 వరల్డ్ కప్

దుబాయ్: డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా టీ20 వరల్డ్ కప్‌లో వరుసగా మూడో విజయంతో హ్యాట్రిక్ కొట్టింది. శుక్రవారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో తొమ్మిది వికెట్లతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. తద్వారా గ్రూప్ టాపర్ స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోవడంతో సెమీఫైనల్ స్థానాన్ని దాదాపు ఖాయం చేసుకుంది. మొదట పాకిస్థాన్ 19.5 ఓవర్లలో 82 పరుగులకే కుప్పకూలింది. అలియా రియాజ్ (26), సిద్రా అమీన్ (12), ఇరామ్ జావెద్ (12) మోస్తరుగా ఆడారు. గార్డెనర్ నాలుగు, సదర్లాండ్, వేరామ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఇక స్వల్ప లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 11 ఓవర్లలో 83/1 స్కోరుతో ఛేదించింది. కెప్టెన్ హీలీ (37 రిటైర్డ్ హర్ట్), ఎలీస్ పెర్రీ (22 నాటౌట్) మెరిశారు. గార్డెనర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. ఆదివారం జరిగే తదుపరి మ్యాచ్‌లో భారత్‌ను ఆస్ట్రేలియా ఢీకొననుంది.

సంక్షిప్తస్కోర్లు: పాకిస్థాన్: 19.5 ఓవర్లలో 82 ఆలౌట్ (అలియా రియాజ్ 26, సిద్రా అమీన్ 12, ఇరామ్ జావెద్ 12, గార్డెనర్ 4/21, సదర్లాండ్ 2/15, వేరామ్ 2/16); **ఆస్ట్రేలియా:** 11 ఓవర్లలో 83/1 (హీలీ 37 రిటైర్డ్ హర్ట్, ఎలీస్ పెర్రీ 22 నాటౌట్, గార్డెనర్ 7 నాటౌట్, సాదియా ఇక్బాల్ 1/17).

ఫైనల్లో అలాస్కన్‌తో త్రివేణి ఢీ

లండన్: గ్లోబల్ చెస్ లీగ్ ఫైనల్లో టేబుల్ టాపర్ పీబీజీ అలాస్కన్ నైట్స్‌తో త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ అమీతుమీ తేల్చుకోనుంది. శుక్రవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో త్రివేణి 9-7తో ఆల్పైన్ ఎస్‌జీ పైపర్స్‌పై గెలిచింది. ఇతర మ్యాచ్‌ల్లో అలాస్కన్ నైట్స్ 14-5తో అమెరికన్ గ్యాంబిట్స్‌పై, గ్యాంజీస్ గ్రాండ్‌మాస్టర్స్ 12-4తో అప్‌గ్రాడ్ ముంబా మాస్టర్స్‌పై నెగ్గాయి. లీగ్ దశ ముగిసేసరికి అలాస్కన్ 114 పాయింట్లతో టాప్‌లో నిలవగా, త్రివేణి 99 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. శనివారం ఫైనల్ జరగనుంది.

మ్యాచ్ రా. 7 గం.నుంచి స్పోర్ట్స్ 18లో...

టార్గెట్.. క్లీన్‌స్వీప్



ఉప్పల్ మైదానంలో పిచ్‌ని పరిశీలిస్తున్న కెప్టెన్ సూర్యకుమార్

టీమిండియాలో మార్పులు ?
బంగ్లాతో నేడు ఆఖరి టీ20

ఉప్పల్ వేదికగా పోరు

హైదరాబాద్: తొలి రెండు టీ20ల్లో ఏకపక్ష విజయాలు సాధించిన భారత్..బంగ్లాదేశ్‌తో ఆఖరి మ్యాచ్‌లోనూ ఆ జోరు కొనసాగించడం ద్వారా సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని భావిస్తోంది. రెండు జట్ల మధ్య మూడో, చివరి మ్యాచ్ శనివారం ఇక్కడ జరగనుంది. మరోవైపు ఈ మ్యాచ్‌లో గెలుపొంది వెటరన్ మహ్మదుల్లాకు విజయంతో వీడ్కోలునివ్వాలని బంగ్లాదేశ్ పట్టుదలగా ఉంది. సిరీస్‌ను టీమిండియా ఇప్పటికే సొంతం చేసుకున్న నేపథ్యంలో రిజర్వ్ ఆటగాళ్లను పరిశీలించే అవకాశముంది. దాంతో లెగ్‌స్పిన్నర్ రవి బిష్ణోయ్, హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ, జితేశ్ శర్మ, హర్షిత్ రాణాల్లో ఒకరిద్దరికి స్థానం దక్కవచ్చు. రెండు మ్యాచ్‌ల్లోనూ ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ అంచనాలను అందుకోలేకపోయారు. మొదటి టీ20లో ఇద్దరూ తక్కువ స్కోర్లకే అవుట్‌కాగా..ఢిల్లీ మ్యాచ్‌లో చక్కటి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. ఇక..తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్‌పై మరోసారి అందరి దృష్టి నిలిచింది. రెండో టీ20లో బంగ్లాదేశ్ బౌలర్లను ఎడాపెడా బాదేసిన నితీశ్..బౌలింగ్‌లోనూ రాణించి రెండు వికెట్లు పడగొట్టాడు. సుదీర్ఘకాలం తర్వాత జట్టులో చోటు దక్కించుకున్న మిస్టర్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి రెండు మ్యాచ్‌ల్లోనూ సత్తా చాటాడు. స్పీడ్‌స్టర్ మయాంక్ యాదవ్ 150 కి.మీ.లకుపైగా వేగంతో ఆకట్టుకున్నాడు. 38 ఏళ్ల బంగ్లా వెటరన్ ఆటగాడు మహ్మదుల్లా ఆఖరి టీ20 మ్యాచ్ ఆడబోతున్నాడు. ఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ టాపార్డర్ బ్యాటర్లంతా విఫలమైన వేళ..మహ్మదుల్లా (41)నే చెప్పుకోతగ్గ స్కోరు చేయడం గమనార్హం. మరి..విజయంతో అతడికి వీడ్కోలు పలకాలంటే బంగ్లాదేశ్ బ్యాటర్లతోపాటు బౌలర్లు అద్భుతంగా రాణించక తప్పదు.



షంటో

జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్, రింకూ సింగ్, హార్దిక్, పరాగ్, సుందర్, వరుణ్/బిష్ణోయ్, అర్ష్‌దీప్, మయాంక్ యాదవ్/హర్షిత్.

బంగ్లాదేశ్: షంటో (కెప్టెన్), పర్వేజ్, లిట్టన్ (కీపర్), తౌహిద్, మహ్మదుల్లా, మెహిదీహసన్, మెహిదీహసన్ మిరాజ్, రిషద్, టస్కిన్, తన్జిమ్ సకీబ్, ముస్తాఫిజుర్

పిచ్: ఈ పిచ్‌పై 2024 ఐపీఎల్‌లో మూడు జట్లు తొలుత బ్యాటింగ్ చేసి 200లకుపైగా పరుగులు చేసి గెలుపొందాయి. అంటే..పరుగుల వరద ఖాయమన్నమాట.

వాతావరణం..

గత రెండు రోజులుగా హైదరాబాద్‌లో సాయంత్రం వేళ వర్షం కురుస్తోంది. శుక్రవారం కూడా భారీ వర్షం కురవడంతో మైదానాన్ని కవర్లతో కప్పాల్సి వచ్చింది. దాంతో బంగ్లాదేశ్ జట్టు ప్రాక్టీస్‌కు అంతరాయం కలిగింది. శనివారం ఉదయం వర్షం కురిసే అవకాశం 40 శాతం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే మ్యాచ్ సమయంలో వర్షానికి లేకపోయినా, ఆకాశం మేఘావృతమై ఉంటుందని సమాచారం.

మహిళల వరల్డ్‌కప్‌లో నేడు

న్యూజిలాండ్ X శ్రీలంక	మ. 3.30
బంగ్లాదేశ్ X దక్షిణాఫ్రికా	రా. 7.30

కివీస్‌తో టెస్టులకు రోహిత్ సేన ఇదే..

రిజర్వ్ ఆటగాడిగా నితీశ్



ముంబై: స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరగనున్న మూడు టెస్టుల సిరీస్‌కు భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. రోహిత్ శర్మ సారథ్యంలోని ఈ జట్టుకు బుమ్రాను వైస్‌కెప్టెన్‌గా నియమించారు. ఈనెల 16న బెంగళూరులో జరిగే తొలి టెస్టుతో ఈ సిరీస్ ఆరంభమవనుంది.

జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్),బుమ్రా (వైస్ కెప్టెన్)యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్ (వికెట్‌కీపర్), ధ్రువ్ జురెల్ (వికెట్‌కీపర్), రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ఆకాష్‌దీప్; **రిజర్వ్ ప్లేయర్లు:** నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, మయాంక్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ

సెమీస్‌లో రష్మిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ మహిళల వరల్డ్ టెన్నిస్ టూర్ మైసూర్ ఓపెన్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక సెమీఫైనల్లో ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్స్ పోరులో శ్రీవల్లి 6-2, 6-2తో భారత్‌కే చెందిన ఆకాంక్షపై నెగ్గి టైటిల్‌కు చేరువైంది. అంతకుముందు జరిగిన ప్రీక్వార్టర్స్‌లో రష్మిక 6-1, 6-3తో తనీషా కశ్యప్‌పై గెలుపొందింది.

చెలరేగిన ఆంధ్ర బౌలర్లు

విదర్భ 118 ఆలౌట్



శశికాంత్ (3/31)

నాగ్‌పూర్: ఆంధ్ర పేస్ బౌలర్లు చెలరేగడంతో రంజీ సీజన్ తొలి మ్యాచ్‌లో విదర్భ జట్టు కుప్పకూలింది. సొంతగడ్డపై శుక్రవారం మొదలైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన విదర్భ.. పిచ్‌ని సరిగా అంచనా వేయలేక తొలి ఇన్నింగ్స్‌లో 38.5 ఓవర్లలో కేవలం 118 పరుగులకే ఆలౌటైంది. అక్షయ్ వాడ్కర్ (46 నాటౌట్) మినహా అందరూ విఫలమయ్యారు. ఆంధ్ర పేసర్లు శశికాంత్ (3/31), స్టీఫెన్ (2/43), సత్యనారాయణ రాజు (2/26)తోపాటు స్పిన్నర్ లలిత్ మోహన్ (2/18) అదరగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన ఆంధ్ర జట్టు 33 ఓవర్లలో వికెట్ నష్టానికి 114 పరుగులు చేసింది. అభిషేక్ రెడ్డి (62 నాటౌట్), షేక్ రషీద్ (49 నాటౌట్) క్రీజులో ఉన్నారు. హనుమ విహారి (1) విఫలమయ్యాడు.

పాక్‌కు ఘోర పరాభవం

ఇన్నింగ్స్ తేడాతో ఇంగ్లండ్ విజయం



జాక్ లీచ్ (4/30)

ముల్తాన్: టెస్టు క్రికెట్ చరిత్రలోనే ఘోర పరాజయాన్ని పాకిస్థాన్ జట్టు మూటగట్టుకుంది. శుక్రవారం ముగిసిన తొలి టెస్టులో ఇంగ్లండ్ జట్టు ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో భారీ విజయాన్ని అందుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 152/6తో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్థాన్ 220 పరుగులకు ఆలౌటైంది. 11వ నెంబర్ ఆటగాడు అబ్రార్ అహ్మద్ జ్వరం కారణంగా బ్యాటింగ్‌కు దిగలేదు. సల్మాన్ ఆగా (63), ఆమెర్ జమాల్ (55 నాటౌట్) రాణించారు. ఐదోరోజు పతనమైన మూడు వికెట్లనూ జాక్ లీచ్ సాధించాడు. మొత్తంగా లీచ్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. కాగా 147 సంవత్సరాల టెస్ట్ క్రికెట్ చరిత్రలో మొదటి ఇన్నింగ్స్‌లో 500కుపైగా పరుగులు సాధించి..ఇన్నింగ్స్ తేడాతో ఓటమిపాలైన తొలి జట్టుగా పాక్ అపఖ్యాతిని మూటగట్టుకుంది. మొదటి ఇన్నింగ్స్‌లో పాక్ 556, ఇంగ్లండ్ 7 వికెట్లకు 823 (డిక్లేర్డ్) పరుగులు చేశాయి. కాగా 2021 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకూ పాకిస్థాన్ జట్టుకు సొంతగడ్డపై విజయం దక్కలేదు. అప్పటినుంచి 11 టెస్టులాడి ఏడు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది.

దేవర 2లో రణ్‌బీర్, రణ్‌వీర్?



ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవర' చిత్రం ఇటీవలే విడుదలై పాన్ ఇండియా స్థాయిలో ఘన విజయం అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి కొనసాగింపుగా రాబోతున్న 'దేవర 2' చిత్రం గురించి పలు ఆసక్తికర విషయాలను కొరటాల శివ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'దేవర' చిత్రంలో విలన్ పాత్రలో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్, కథానాయికగా జాన్వీకపూర్ నటించారు. వీరితో పాటు రెండో భాగంలో మరికొందరు బాలీవుడ్ తారలు భాగమవనున్నారని ఆయన చెప్పారు. 'దేవర 2'లో కొన్ని అతిథి పాత్రలు ఉన్నాయి. అవి కథలో చాలా కీలకంగా ఉంటాయి. రణ్‌వీర్‌సింగ్, రణ్‌బీర్‌కపూర్ లాంటి బాలీవుడ్ స్టార్స్ ఆ పాత్రల్లో నటిస్తే బాగుంటుందని నాకు అనిపిస్తోంది. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. జరుగుతుందో లేదో తెలియదు కాబట్టి ఇప్పుడే దీని గురించి నేను ఎక్కువ మాట్లాడకూడదు. కొంతమంది తెలుగు, తమిళ హీరోలు అయినా ఆ పాత్రలు పోషిస్తే బావుంటుంది. వారి పేర్లు చెబితే ఇప్పటి నుంచే ఊహాగానాలు మొదలవుతాయి కాబట్టి చెప్పడం లేదు. త్వరలోనే వివరాలు ప్రకటిస్తాం' అన్నారు.



వశిష్ట దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' సెట్స్‌లో సందడి నెలకొంది. శుక్రవారం వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి ఈ మూవీ సెట్స్‌కు వచ్చారు. ఈ సందర్భంగా చిరంజీవితో కలసి వెంకటేశ్, అనిల్ రావిపూడి, మీనాక్షీ చౌదరి, ఐశ్వర్య రాజేశ్ దిగిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి.

రాజకీయాల్లోకి సాయాజీ షిండే



వెండితెరపై విలన్, కమెడియన్ పాత్రల్లో నటించి తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన మరాఠా నటుడు సాయాజీషిండే రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. శుక్రవారం ఆయన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ)లో చేరారు. అజిత్‌పవార్ స్వయంగా కండువా కప్పి సాయాజీ షిండేను పార్టీలోకి ఆహ్వానించారు. అజిత్‌పవార్ పనితీరు నచ్చి ఎన్సీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు షిండే తెలిపారు. త్వరలో మహారాష్ట్రలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్సీపీ తరఫున ప్రచారం చేయడంతో పాటు సాయాజీ షిండే ఎమ్మెల్యేగా బరిలో నిలవనున్నారని సమాచారం.

రేసర్‌గా నిఖిల్



సుధీర్ వర్మ దర్శకత్వంలో నిఖిల్ సిద్ధార్థ్, రుక్మిణీ వసంత్ జంటగా నటిస్తున్న చిత్రం 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'. బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో నిఖిల్ రిషి అనే పాత్రలో రేసర్‌గా కనిపించనున్నారు. నవంబర్ 8న సినిమా విడుదల కానుంది. హర్ష చెముడు, దివ్యాంశ కౌశిక్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎడిటర్: నవీన్ నూలి, సినిమాటోగ్రఫీ: రిచర్డ్ ప్రసాద్.

మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నా



బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్‌ను కథానాయిక రష్మిక మందన్న పొగడ్తలతో ముంచెత్తారు. శుక్రవారం అలియా నటించిన 'జిగ్రా' చిత్రం విడుదలైంది. ప్రత్యేక ప్రదర్శనకు రష్మిక హాజరయ్యారు. ఈ నేపథ్యంలో అలియా కథల ఎంపిక అద్భుతంగా ఉందని ఇన్‌స్టాగ్రామ్‌లో రష్మిక మెచ్చుకున్నారు. 'అలియా నువ్వు మాకు దొరకడం ఓ వరం. నటిగా నీలోని ప్రతిభను మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నాను. విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్నందుకు ధన్యవాదాలు. ఇలానే మరెన్నో గొప్ప చిత్రాల్లో ప్రేక్షకులను అలరించాలి' అని ఆకాంక్షించారు.

గొప్ప చిత్రాల్లో ఒకటిగా నిలుస్తుంది



మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. మీనాక్షీ చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. ఈ నెల 31 సినిమా విడుదలవుతోంది. శుక్రవారం ఈ చిత్ర దర్శకుడు, నిర్మాత మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ "త్వరలోనే సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నాం. సినిమా అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. ఈ మధ్య కాలంలో తెరకెక్కిన గొప్ప చిత్రాలలో ఇది ఒకటిగా నిలుస్తుంది. విజయంపై పూర్తి ధీమాతో ఉన్నాం" అని చెప్పారు. "ఇది 1980-90ల కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనలను ఆధారంగా చేసుకుని రాసుకున్న కల్పిత కథ. ఇప్పటిదాకా నేను తీసిన సినిమాల్లో ఇది ప్రత్యేక చిత్రంగా నిలుస్తుంది. సినిమా సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుంది" అని దర్శకుడు వెంకీ అట్లూరి చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd.,Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Racharla Road, Alampuram, Tadepalligudem - 534 166, West Godavari District, Andhra Pradesh. Editor : K. Srinivas. Phone No: 08818 - 280013.RNI No:APTEL/2003/09832. Managing Director : Vemuri Radhakrishna. Founder : K.L.N. Prasad.

బాలికలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



టి. నరసాపురంలో అవగాహన ర్యాలీ

చింతలపూడి, అక్టోబరు 11: బాల్య వివాహాలు నేరమని ఐసీడీఎస్ పీఓ పి.మాధవి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బాలికలకు సాధికారత, సమాన హక్కు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ప్రమద్వర, ఎంపీడీఓ మురళీకృష్ణ, ఎంపీపీ బి.రాంబాబు, ఎంఈఓ కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


లింగపాలెం: బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలని, క్రమశిక్షణ, పట్టుదల, మానసిక వికాసం, ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్ళాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి అన్నారు. మఠంగూడెంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ బాలికలు ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ఐసీడీఎస్ తోడుంటుందన్నారు.

వేలేరుపాడు: వేలేరుపాడు ఎంపీడీఓ కార్యాలయంలో బాలికా దినోత్సవం అంగన్వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న మహిళలు పాల్గొన్నారు. ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ అగద, ఐసీడీఎస్ సూపర్ వైజర్ మయూరి మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష కూడదని, బాల్య వివాహాలు వద్దని సూచించారు. ఏఎస్ఎంలు, ఆశా వర్కర్లు, ఉపాధి సిబ్బంది, వీఆర్వోలు పాల్గొని ర్యాలీ నిర్వహించారు.

పోలవరం: బాలికల్ని చదివించాలని పోలవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె వాసు సూచించారు. పోలవరం పంచాయతీ కార్యాలయంలో అంగన్వాడీల ఆధ్వర్యంలో జరిగిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సర్పంచ్ పోడుం పుష్ప, ఎంపీడీఓ ఇఎస్ఎస్ శ్రీనివాసరావు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు ఏఎస్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టి.నరసాపురం: ఆడపిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని సర్పంచ్ జి.సునంద అధ్యక్షతన నిర్వహించారు. సూపర్‌వైజర్‌లు ఎం.లక్ష్మి, జి.ఉషారాణి మాట్లాడారు.

బుట్టాయగూడెం: ప్రతి బాలికా విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డిప్యూటీ తహసీల్దార్ పి.రమేష్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కిశోర బాలికలను సన్మానించారు.



జంగారెడ్డిగూడెం పట్టణంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి



విశ్వనాథ ఆశ్రమంలో మెమెంటో అందుకుంటున్న ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్

జయ జయహే మహిషాసుర మర్దిని..

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 11: శరన్నవరాత్రుల్లో భాగంగా స్థానిక గంగానమ్మ, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి, నూకాలమ్మ, శ్రీ విజయదుర్గమ్మ, గురవాయిగూడెంలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారు తొమ్మిదవ రోజు శుక్రవారం శ్రీ మహిషాసుర మర్దిని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే రోషన్ కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహానికి శుక్రవారం ముఖంపై నీటి బిందువులు ఏర్పడడంతో విజయదశమి ముందురోజు అమ్మవారి ముఖంపై చెమటలు పట్టాయని, భక్తులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తొమ్మిదో రోజు సందర్భంగా శుక్రవారం వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిళలు 108 రకాల హారతులు ఇస్తున్న సమయంలో అమ్మవారి ముఖంపై చెమటలు పట్టడం చూసి అర్చకులతో పాటు భక్తులు చూసి ఆశ్చర్యపోయారు.

వేలేరుపాడు: వేలేరుపాడు సంతమార్కెట్‌లో, రుద్రమ్మకోట, శివకాశీపురం, భూదేవిపేట, గ్రామాల్లో కూడా భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కామవరపుకోట: స్థానిక లక్ష్మీహయగ్రీవ లలితాశ్రీ పీఠంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి శాకాంబరి అలంకారం జరిపి మహార్నవమి సందర్భంగా పూజలు చేశారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పీఠాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్యవస్థాపకులు దుర్గబాబు, సత్య శ్రీనివాసాచార్యుల బృందం ఎమ్మెల్యేకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి సత్కరించారు.



లింగపాలెంలో..

లింగపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవార్లు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు.

చింతలపూడి: స్థానిక విశ్వనాథ ఆశ్రమంలో శుక్రవారం రాజరాజేశ్వరి అమ్మవారికి మహిషాసుర మర్దిని అలంకరణ జరిపి పూజలు జరిపారు. సువాసినీలచే లక్ష కుంకుమార్చన, బలిహరణ నిర్వహించారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, టీడీపీ నాయకులు జె.ముత్తారెడ్డి, మాజీ సర్పంచ్ చిట్లూరి ధర్మరాజు ఉత్సవ కార్యక్రమంలో పాల్గొనగా, మఠం నిర్వాహకులు అమ్మవారి చిత్రపటాన్ని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు బహూకరించారు. వేగి లింగేశ్వరస్వామి ఆలయంలో దుర్గామాతకు మహిషాసురమర్దిని అలంకరణ జరిపి పూజలు జరిపారు.

పోలవరం: పోలవరం మండల కేంద్రంలో పాత పోలవరంలో శుక్రవారం శరన్నవరాత్రుల సందర్భంగా కనకదుర్గ దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించాలి

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 11: త్వరలో జరగనున్న ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరచిన అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించడానికి కూటమి నాయకులంతా కృషి చేయాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం జంగారెడ్డిగూడెంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు, ఎన్నికల విధి విధానాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

పోలవరం, అక్టోబరు 11: పోలవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో మద్యం దుకాణాలకు దరఖాస్తులను శుక్రవారం శాఖా కార్యాలయం వద్ద అధికారులు స్వీకరించారు. ఇన్‌స్పెక్టర్ సత్యవతి మాట్లాడుతూ తమ పరిధిలో షాపుల కోసం 510 దరఖాస్తులు అందాయని బుట్టాయిగూడెం, కొయ్యలగూడెం, పోలవరం మండలాలకు 12 మద్యం షాపులకు ప్రతిపాదనలు జరిగాయని తెలిపారు. పోలవరంలో ఒక్క మద్యం షాపు కోసం 55 దరఖాస్తులు అందినట్లు తెలిపారు.

జేపీఎల్ ను ప్రారంభించిన బొరగం

జంగారెడ్డిగూడెం,అక్టోబరు 11: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంగారెడ్డిగూడెం ప్రీమియర్ క్రికెట్ లీగ్ (జేపీఎల్)ను ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. మొదటి రోజు తిరువూరు, నిడదవోలు టీములకు పోటీ జరిగింది. టీడీపీ నాయకులు పరిమి సత్తిపండు, పెనుమర్తి రామకుమార్, కొండ్రెడ్డి కిషోర్, ఎన్.మురళీ చౌదరి, కె.ప్రతాప్ సతీష్, కేతిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

పోలవరం ఎంపీడీవోగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకారం

పోలవరం, అక్టోబరు 11: పోలవరం ఎంపీడీవోగా ఇఎస్ఎస్ శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న జి. శ్రీను బదిలీపై వెళ్ళగా కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న సిహెచ్ శ్రీనివాస్ ఇప్పటి వరకూ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు. ఇప్పటి వరకూ ఈవోపీఆర్డీగా బాధ్యతలు నిర్వర్తించిన ఇఎస్ఎస్ శ్రీనివాస్‌ని ఉన్నతాధికారులు ఎంపీడీవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు.


సంతోషపురం, నూజివీడు, బలివేల్లో మహిషాసుర మర్దినిగా అమ్మవార్లు.. శ్యామలాంబ ఆలయంలో న్యాయాధికారి కె.శ్రీహరి పూజలు

జయజయహే మహిషాసుర మర్దిని

నూజివీడు టౌన్, అక్టోబరు 11 : నూజివీడు మహిషాసుర మర్దిని అమ్మవారు నిజరూప దర్శనం ఇచ్చారు. జమీందారీ కాలం నుంచి కోట మహిషమ్మ నూజివీడు ఇలవేల్పుగా పేరు. శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు నిజరూప దర్శనం ఇవ్వడంతో భక్తులు పోటెత్తారు.

చాట్రాయి: చాట్రాయి కొత్తపేట దుర్గాదేవి పందిరిలో మహిషాసురమర్దిని అలంకరణలో దర్శనం ఇచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. చాట్రాయి, ఆరుగొలనుపేట దుర్గమ్మ పందిళ్ళలో శుక్రవారం భారీ అన్నసమారాధనలు జరిగాయి.

ముసునూరు: బలివే రాజరాజేశ్వరిదేవి మహిషాసుర మర్ధినిగా భక్తులకు దర్శినమిచ్చారు. ముసునూరు పడమట రామాలయంలో దుర్గమ్మకు కుంకుమ పూజలు జరిగాయి.

చాట్రాయి: చాట్రాయి కొత్తపేట దుర్గాదేవి పందిరిలో శ్రీమహిషాసురమర్థిని అలంకరణలో దర్శనం ఇచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. చాట్రాయి, ఆరుగొలనుపేటలలో కనకదుర్గమ్మ విగ్రహ పందిళ్ళలో శుక్రవారం భారీ అన్నసమారాధనలు జరిగాయి.

కైకలూరు: కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారు శుక్రవారం పార్వతీదేవీ అలంకరణలో దర్శనమిచ్చారు. పంపన శ్రీనివాసరావు, కనకదుర్గమ్మ దంపతులు అమ్మ వారికి పుష్పాలంకరణ చేయించారు. దాతల సహకారంతో భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. అమ్మవారిని ఉయ్యూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.శ్రీహరి కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

శనివారం శ్రీశ్యామలాంబ అమ్మవారు మహిషాసుర మర్దిని గా దర్శనమివ్వనున్నారు. కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారికి భుజబలపట్నానికి చెందిన ముదునూరు జానకి రవీంద్రసుబ్బరాజు దంపతులు నిర్వహించారు.

కలిదిండి: సంతోషపురం దుర్గమ్మ మహిషాసురమర్ధినిగా దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు.

ముదినేపల్లి: దేవపూడి, వణుదుర్రు గ్రామాల్లో శుక్రవారం రాత్రి అమ్మవార్లను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పాల్గొని పూజలు జరిపారు.

మహిళా సాధికారత సాధించాలి

నూజివీడు టౌన్, అక్టోబరు 11: సమాజ ఆర్థిక, సామాజికాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని ఆర్డీవో వాణి అన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో జాతీయ బాలికా దినోత్సవంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మహిళా హక్కుల పరిరక్షణ, సమాజంలో వారి పాత్రపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు ఇన్‌చార్జి తహసీల్దార్ సుబ్బారావు, ఎంపీడీవో రాఘవేంద్రనాథ్, సీడీపీవో నూరాని తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: సమాజంలో బాలికల పట్ల అసమానత్వ ధోరణిని రూపు మాపాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని కైకలూరు ఐసీడీఎస్ సీడీపీవో దీప్తి అన్నారు. శుక్రవారం ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో భవిష్యత్తు కోసం బాలికల దృష్టి అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు.

ముసునూరు: నేటి సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాల నుండి బాలికలను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మియా, సూపర్‌వైజర్ ధనలక్ష్మీలు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ముసునూరులో అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు సంయుక్తంగా అవగహన ర్యాలీ నిర్వహించారు.

చాట్రాయి: కిషోర బాలికల ఆరోగ్యం, విద్య సంరక్షణ అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రీదేవి, సిహెచ్‌వో రమణ అన్నారు. చాట్రాయి జీజీ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. బాల్యవివాహాల వలన అనర్థాలుపై వివరించారు.

హిందూ ధర్మ సమితి బెంచీల వితరణ

మండవల్లి, అక్టోబరు 11:మండవల్లి ప్రధాన కూడలిలో, దేవస్థానాల వద్ద ప్రజల సౌకర్యార్థం హిందూ ధర్మసమితి ఆధ్వర్యంలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. హిందూ ధర్మసమితి నిర్వాహకులు చత్రపతి శివాజీ మహారాజ్, సభ్యులు పాల్గొన్నారు.